

వార్త

ఆదివారం

22 డిసెంబరు, 2024

# తరిగిన బోధన.. పెరిగిన వేదన!



# అద్వితీయం..అపూర్వం

భారతీయ చలన చిత్రరంగానికి బాలీవుడ్ నటుడు రాజ్‌కపూర్ చేసిన అద్వితీయ, అపూర్వ సేవలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుతించారు. తన సినిమాలతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధులను చేశారని, అందుకే రాజ్‌కపూర్ గురించి నేటితరానికి తెలియాల్సి ఉందని ప్రధాని అన్నారు. సాఫ్ట్‌వేర్ లాంటి సాంకేతికత అభివృద్ధి చెందని రోజుల్లో రాజ్ కపూర్ తన నటనతో అసమాన ప్రతిభను చాటిచెప్పారని ప్రధాని అన్నారు. కే.శే.రాజ్‌కపూర్ శత జయంతి దినోత్సవాల గురించి ఆయన కుటుంబ సభ్యులు ప్రధానిని ప్రత్యేకించి కలిశారు. భారతీయులపైనే కాకుండా, వ్యక్తిగతంగా తనపైన కూడా రాజ్‌కపూర్ ప్రభావం చూపారంటూ, తన రాజకీయపు తొలి అడుగుల్లో రాజ్‌కపూర్ తనకు స్ఫూర్తిదాయకమయ్యారన్నారు. అప్పట్లో ఎన్నికల్లో జనసంఘ్ పార్టీ ఓటమి చవిచూసిన సందర్భంలో మిత్రులతో 'ఫిర్ శుభా హోగా' చిత్రాన్ని చూసిన తర్వాత 'తెల్లవారుతుంది, మళ్లీ వేకువ వస్తుందని' అంతర్లీనంగా అలాంటి భావాన్ని కలుగచేసి తమకు మళ్లీ గెలుపుపై ఆశలు చిగురింప చేసిందన్నారు. రాజ్ కపూర్ నటించిన తొలి 'నీల్ కమల్' చిత్రం 1947లో తయారైందన్నారు. ఒక విధంగా రాజ్ కపూర్‌ను భారతదేశ సాంస్కృతిక రాయబారిగా పేర్కొనవచ్చున్నారు. ప్రధానిని కలిసిన వారిలో రాజ్‌కపూర్ సంతాన మంతా ఉన్నారు. చిత్రసీమలో రాజ్‌కపూర్ వారసులుగా ఉన్న వారంతా ప్రధానితో సంభాషించారు. రణధీర్ కపూర్, రీమా కపూర్, కరీనా కపూర్, సైఫ్ అలీ ఖాన్, అలియాభట్, కరిష్మా కపూర్, ఆర్మాన్ జైన్‌లు. యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉండే విధంగా రాజ్‌కపూర్ సినీ ప్రస్థానాన్ని ఓ చిత్రంగా రూపొందించాలని రాజ్ కపూర్ వారసుల్ని మోడీ కోరారు. దివంగత రాజ్‌కపూర్ కుమార్తె రీమా కపూర్ కృతజ్ఞతా పూర్వక భావంతో గ్లోబల్ అంబాసిడర్‌గా భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టి మోడీని ప్రశంసించారు. రాజ్ కపూర్ నటించిన సినిమాలలో కళాఖండాలను దేశవ్యాప్తంగా అన్ని థియేటర్లలో ప్రదర్శించే ఏర్పాటు చేశామన్నారు. ఈ ఉత్సవాలకు ప్రధానిని ఆహ్వానించారు.



రాజ్ కపూర్ ఫ్యామిలీతో మోడీ

## తారాతీరం

# 'జాతిరత్నాలు' దర్శకుడితో విశ్వక్ సేన్

జాతిరత్నాలు వంటి హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో దర్శకుడిగా అందరి ప్రశంసలు అందుకున్న అనుదీప్ తన తాజా చిత్రానికి శ్రీకారం చుట్టాడు. ఇప్పటివరకు మాస్ సినిమాలు చేస్తూ వచ్చిన హీరో విశ్వక్‌సేన్ కథానాయకుడిగా అనుదీప్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ తాజా చిత్రం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూర్తి వినోదాత్మక కుటుంబ కథా చిత్రంగా రూపొందనున్న ఈ చిత్రంలో విశ్వక్‌సేన్ పాత్ర మునుపెన్నడు చూడని విధంగా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. 2025 జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.



ఆదివారం వార్త

22 డిసెంబరు, 2024

## కదంబం

సంఘీ'భావం....5

సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టం అవసరం

కవర్ స్టోరీ

తరిగిన బోధన.. పెరిగిన వేదన!

ఈవారం కవిత్వం...12

మీరా పాన్ దోస్తానా

హ్యాపీ క్రిస్మస్....14

బహుళ ప్రయోజనకారి.....18

కథ..20

ఆచార్య దేవోభవ

సాహిత్యం...23

కాకతీయులనాటి తెలుగు వెలుగు

నటన అనివార్యం......24

అద్భుత యాత్రానుభవం....26

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

### మంచి ముత్యాలు

ఏమైనా సాధించడానికి మీ వద్ద సమయం అంటూ ఉండదు. అందుకే సమయాన్ని కల్పించుకోవాల్సి ఉంటుంది.

- చార్లెస్ బక్స్టన్

# తాజా వార్తలు

## ఆడవాళ్లకి నిద్ర తక్కువ

నిద్రకి ఆడా, మగా అనే తేడా ఉండదు. కంటి నిండా నిద్రలేకపోతే డయాబెటిస్, అల్జీమర్స్ మొదలుకుని ఎన్నో అనారోగ్యాలు తలెత్తే అవకాశం ఉంది. మంచినిద్రను అందించే ఔషధాలు తయారు చేసే క్రమంలో ఆడా, మగా నిద్రించే విధానంలోని తేడాలపైన దృష్టిపెట్టి కొన్ని పరిశోధనలు చేశారు. ఉదాహరణకి భార్యాభర్తలిద్దరూ ఆరు



గంటలే నిద్రపోయినా, మగవాళ్లు నిద్రపోయినంత గాఢంగా ఆడవాళ్లు నిద్రపోవడం లేదట. మగవాళ్లు ఆదమరిచి ఏ కల లేకుండా నిద్రపోతుంటే, ఆడవాళ్లకి మాత్రం నిద్ర మధ్యలో తరచూ మెలకువ రావడంతో కలత నిద్రే మిగులుతోందట. ముఖ్యంగా పిల్లలున్న తల్లుల్లో వాళ్ల గురించిన అప్రమత్తత వల్ల ఇలా తరచూ నిద్రలేవడం జరుగుతోంది. అలాగే, నెలసరి సమయంలో కూడా సరిగా నిద్రపోరట. ఇంతవరకూ పరిశోధనల్లో మగవారు నిద్రపోయే విధానాన్ని దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఔషధాలు తయారుచేస్తున్నారు. ఈ జెండర్ గ్యాప్‌ని గుర్తించడం వల్ల ఆడవారికి తగిన నిద్రమాత్రలు తయారు చేసి, వారిలో నిద్రలేమి కారణంగా వచ్చే డయాబెటిస్, ఊబకాయం వంటి అనారోగ్యాలని అడ్డుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com









## బేషుగ్గా!

కాదేదీ కవితకనర్హం అని శ్రీ శ్రీ అంటే .. రూపం మారినా
కళాత్మకంగానో ..ఆకర్షణీయంగానో ఉంటే.. వాటి ఆదరణకు
కొదవే ఉండదని ఆయా కళారూపాల సృష్టికర్తల భావన.
ఇప్పుడా రూపాలు కొత్త చొక్కాలు తొడుక్కున్నాయ్.
కాదు..కాదు..కొత్త ..షూ..లు తొడుక్కున్నాయి...
అనుకుందామా మరి!







## 'సంఘీ' భావం



# సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టం అవసరం

ప్రస్తుతం సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న సోషల్ మీడియాను కట్టడిచేయడానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టం రూపకల్పన దిశగా అడుగులు పడుతున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఇది శుభపరిణామం. పత్రికలు, టీవీలు ఇచ్చే వార్తలపై ఆంక్షలు ఉంటాయి. తప్పుడు వార్తలు రాసినా, ప్రసారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. కొంతమంది జర్నలిస్టులు, యాజమాన్యాలు జైలుకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీనితో ఒకరిని లక్ష్యంగా చేసుకుని అబద్దాలను జొప్పించివార్తలు రాయడం, ప్రసారం చేయడం వంటివి చాలా అరుదుగా ఉంటుంది. అయితే సోషల్ మీడియా పిచ్చోడి చేతిలో రాయి వంటిది. అది ఎవరినైనా టార్గెట్ చేసి పరువును బజారుకు ఈడ్చుతుంది. ముఖ్యంగా రాజకీయాల్లో ఈ ప్రభావం అధికంగా కనిపిస్తుంది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో ఈపరిస్థితి ఎప్పుడో అదుపు తప్పింది. అసభ్యపదజాలంతో ప్రత్యర్థులపై సోషల్ మీడియాలో పోస్టింగ్ చేయడం, దానిని పెద్ద ఎత్తున వైరల్ చేయడం వంటివి ఒక మాఫియా వ్యవస్థగా మారింది. దేశవ్యాప్తంగా దాదాపు ఇదే పరిస్థితి ఉన్నా తెలుగు రాష్ట్రాలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా ఉంది. ఈ రాష్ట్రంలో వేలాది మంది సోషల్‌మీడియా యాక్టివిస్టులుగా ఉన్నారు. వీరికి తప్పుడు పోస్టింగ్‌లు చేయడం, వాటిని వైరల్‌చేయడం ఒక ఉపాధిగా మార్చుకున్నారు. ఇలాంటి వారికి కొన్ని రాజకీయ పార్టీలు నెలవారీ జీతాలు కూడా చెల్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా కార్యాలయాలు ఏర్పాటుచేసుకుని షిఫ్టుల వారీగా ఉద్యోగాలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత వరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయ విమర్శలతో పాటు ఏకంగా వ్యక్తిగత వ్యవహారాలపై కూడా ఈ ఉద్యోగులు బురదనుజల్లుతారు. సందేశాలను తయారుచేసే కేటగిరి, వాటిని గ్రాఫిక్స్‌లో మార్చే నిపుణులు, వీటిని వైరల్ చేయడానికి ఒక సైన్యం వంటివి ఈ వ్యవస్థలో కీలకంగా ఉంటాయి. రోజుకు వంద నుంచి రెండు వందల వరకు తప్పుడు వార్తలను, తప్పుడు సమాచారాన్ని సాధ్యమైనంత ఎక్కువ మందికి అందించడం వీరి ప్రధాన కర్తవ్యంగా ఉంది. అయితే దీనివల్ల సమాజానికి ఎంత కీడు జరుగుతుందన్న విషయాన్ని వీరిని పెంచి పోషిస్తున్న పెద్దలు గుర్తించలేకపోతున్నారు. ఈరోజు డబ్బు తీసుకుని ఎదుటివారిని తిట్టినవారు ప్రత్యర్థి వద్దకు చేరి అంతకు రెండింతలు తమపై కూడా బురద జల్లుతారనే వాస్తవాన్ని గ్రహించడం లేదు. ఇటీవల కాలంలో ఏపీ పోలీసులు తప్పుడు సమాచారాన్ని సోషల్‌మీడియాలో జొప్పిస్తున్న వారిపై దృష్టిసారించారు. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిని పట్టుకుని అరెస్ట్‌చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నారు. అయితే సోషల్‌మీడియాకు సంబంధించి ప్రత్యేక చట్టాలు లేకపోవడంతో కనీసం జైలు ద్వారం వద్దకు కూడా వెళ్లకుండా బెయిల్ తీసుకుని ఇంటికి వెళ్లిపోతున్నారు. చట్టాలు తమను ఏమీ చేయలేవన్న ధైర్యంతో మరింతగా రెచ్చిపోయి సోషల్‌మీడియాలో అబద్దపు ప్రచారం కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ తరహా కొత్త నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రంగం సిద్ధం చేసింది. అసభ్య పోస్టులు, మార్ఫింగ్ వీడియోలతో పేట్రేగిపోతున్న సోషల్ మీడియా మాఫియాపై ప్రత్యేక చట్టానికి రూపకల్పన చేస్తున్నారు. సోషల్ మీడియా నిగ్గుతేల్చేందుకు నలుగురు మంత్రులతో ఉపసంఘాన్ని కూడా ఏర్పాటుచేసింది. సోషల్ మీడియా పోస్టింగ్‌లతో పాటు సైబర్ నేరాలు, రుణయాప్‌ల దారుణాలు, ఇతర సాంకేతిక మోసాలకు సంబంధించిన నేరాలపై విశ్లేషణ చేస్తున్నారు. అదేవిధంగా సాంకేతికంగా అనుభవం కలిగిన నిపుణులతో పాటు, ఐపిఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటుచేసి అధ్యయనం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రుణయాప్‌ల వైఖరి దారుణంగా తయారైంది. రూ. 2వేల రుణం తీసుకున్న వ్యక్తి దానికి మూడింతలు చెల్లించినా ఇంకా డబ్బు చెల్లించాలని డిమాండ్ చేయడమే కాకుండా ఆ యువకుడి ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ఉంచారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన విశాఖలో జరిగింది. పైగా అతనికి రెండు నెలల క్రితమే వివాహం అయ్యింది. సైబర్ నేరాలకు సంబంధించిన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఒక సమగ్రచట్టం రూపకల్పన చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే సిఐడి, ఐటీ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. వీరికి సైబర్ నేరాలపై అవగాహన ఉంది. వీరికి మరింత తర్ఫీదు ఇచ్చి కేసులను మరింత పకడ్బందీగా న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టాలి. దీనికి సాంకేతికపరమైన ఆధారాలను సాక్ష్యాలుగా కోర్టు ముందుంచాల్సి ఉంటుంది. ప్రస్తుతం సైబర్ నేరాల పరిశోధనలో అనేక అడ్డంకులు ఉంటున్నాయి. ఎదుటి వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేవిధంగా పోస్టింగ్ చేసినా కోర్టులో సరైన సాక్ష్యాలను పోలీసులు అందించలేకపోవడంతో నేరగాళ్లు బయటపడుతున్నారు. ఇక సైబర్‌మోసాలకు పాల్పడేవారు దూర ప్రాంతాల్లో, ఒక్కొక్కసారి విదేశాల్లో ఉంటున్నారు. ఎక్కడి నుంచి మోసం జరిగిందన్న విషయం స్పష్టంగా తేలినా నేరస్తులను పట్టుకోవడం సమస్యగా మారింది. సాధారణ నేరాలకు సైబర్ నేరాల పరిశోధనలో ఎంతో వ్యత్యాసం ఉంటోంది. నేరస్తులను గుర్తించడానికి, వారు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది. ప్రస్తుతం వీటిని లోతుగా పరిశీలన జరిపి, నేరస్థులను పట్టుకుని చట్టం ముందు ప్రవేశపెట్టడానికి కావాల్సిన మేరకు సిబ్బంది కాని, నిధులు కాని ఉండటం లేదు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం ఉండటం లేదు.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# తరిగిన బోధన.. పెరిగిన వేదన!

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హకీం జాని

విద్య అనేది ప్రతి ఒక్కరికీ అతి ముఖ్యమైనది. నవసమాజ నిర్మాణానికి విద్య దోహద పడుతుంది. నానాటికీ విద్యావంతులు పెరుగుతున్నప్పటికీ సమాజంలో మార్పురావడం లేదు. ప్రాచీన కాలం నాటి విలువలు నేటి చదువుల్లో లేదని సర్వత్రా వినిపిస్తుంది. బండెడు పుస్తకాలను బాలకార్మికుల్లా పిల్లలు మోసుకుని పాఠశాలకు వెళుతున్నా, వారు నిజ జీవితంలో అడుగిడినప్పుడు ఆ చదువు ఎంతవరకు ఉపయోగపడుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సమాజ అభివృద్ధిఅనేది ప్రజల విద్యా వివేకాలపై ఆధారపడి ఉంటుంది. విద్య వెలుగునిస్తుంది. దీనిని భారతీయ సమాజం ఆది నుండి గుర్తించింది. తొలినాళ్ళ నుండి విద్యకు చక్కని ప్రాముఖ్యత ఉంది. విద్య జీవితానికి వెలుగునిస్తుందని, అది లేనివాడు నేత్ర దృష్టిలేని వారితో సమానమని భావించేవాళ్ళు. "స్త్రీ, పురుషులకు విద్య చాలా ముఖ్యమైనది. అది జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. తల్లిలాగా పోషిస్తుంది. తండ్రిలా మార్గదర్శిలా నిలుస్తుంది. భార్యలాగా సుఖసౌఖ్యాలను ప్రసాదిస్తుంది. కీర్తిని సంపాదిస్తుంది. కష్టాలు తొలిగిస్తుంది. స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్ని ప్రసాదిస్తుంది. మంచి నాగరికునిగా మారుస్తుంది. పొరుగుదేశంలో ప్రయాణిస్తుంటే మంచి తోడుగా నిలుస్తుంది. ఇన్ని కారణాల వల్ల విద్యను కల్పవృక్షంగా భావిస్తారు. అందుకే ప్రాచీనకాలం నుండి విద్యను మూడోనేత్రంగా భావిస్తూవచ్చారు.

## ప్రాచీన కాలంలో విద్య

క్రీస్తు పూర్వం 1400 నుండి క్రీస్తు పూర్వం 600 వరకూ గల కాలంలో విద్య అనేది పూర్తిగా మతపరమైనదిగానే సాగింది. ఆ తరువాత బౌద్ధ మతం వచ్చాక విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. విద్య గురుకులాలనుండి ఆరామాలకు చేరుకున్నది. బౌద్ధ ఆరామాలలో చాలా మంది గురువులు ఉండి ఇప్పటి మన విశ్వవిద్యాలయాలలాగా బోధన చేసేవారు. ఈ తరుణంలోనే ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు అయిన నలందా విశ్వవిద్యాలయం, తక్షశిల విశ్వవిద్యాలయాలు వచ్చాయి. అనంతరం విద్యాబోధన సంస్కృతం నుండి ప్రజాభాషకు వచ్చింది. తదుపరి ముస్లిం పాలకులు, హిందూ రాజులు విద్యా వ్యవస్థలో అనేక మార్పులు చేశారు. బ్రిటిషు పాలకుల కాలంలో భారతదేశ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా రెండు మార్పులు చెప్పుకోవాలి. అప్పటివరకూ ఎన్ని మార్పులు జరిగినా భారతదేశంలో విద్యావ్యవస్థ హిందూ, బౌద్ధ, ఇస్లాం ఇత్యాది మతాల ప్రభావం ప్రధానమైనదిగానే ఉండేది. కానీ బ్రిటిషువారు వచ్చిన తరువాత భౌతిక విద్యకు ప్రాధాన్యం పెరిగింది. మత విద్యను అభ్యసించడం మానేసి ప్రజలు సైన్సు చదవడం మొదలుపెట్టినారు.

ఇక్కడ మరో ముఖ్యమైన మార్పు ఏమిటంటే ఆంగ్ల భాషలో విద్యాబోధన, అప్పటివరకు పలు భాషలలో ముఖ్యముగా సంస్కృతము, అరబిక్, ఉర్దూలలో జరిగే విద్యాబోధన ఆంగ్ల భాషలోనికి కొంతమేరకు మారింది. బ్రిటిషు పరిపాలకులు ఆంగ్లం బోధించే పాఠశాలలకే ఆర్థిక సహాయం ఇచ్చేవారు. దానితో ఆంగ్ల భాషకు ప్రాముఖ్యత పెరిగింది. బ్రిటిషు వారి విద్యావిధానంలో ఎన్నో కమిటీలు వేశారు. ఎన్నో సంస్కరణలు తెచ్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు భారత దేశాన్ని వదిలే సమయానికి మనదేశంలో అక్షరాస్యత పది శాతం కూడాలేదు. దీనికికారణం వారు పాటించిన ఫిల్టరు పద్ధతి అని చెప్పవచ్చు. ఈ పద్ధతి ద్వారా పై తరగతి వారికి విద్యాబోధన చేసేవారు కింది తరగతివారికి చదువు నేర్పుతారు అని భావించడం జరిగింది. అది ఆచరణలో విఫలమైంది. ఆ మీదట నిజాం కాలంలోని విద్యావ్యవస్థ గురించి మనకు చాలా ఆధారాలు ఉన్నాయి. ఆ కాలంలో తెలుగు భాష ద్వారా విద్యావ్యాప్తికి బొత్తిగా రాజాశ్రయం లేదని తెలుస్తున్నది.

## ఆధునిక విద్య

ఆ రోజులలో కొందరు చక్రవర్తులు సహాయ సహకారాలు అందించడం వల్ల అరబిక్, ఉర్దూ భాషల మనుగడ కొన సాగింది. అనంతరం ఆంగ్లేయులు ఆంగ్ల భాషకు పెద్ద పీట వేశారు. తరువాత వచ్చిన గ్రంథాలయోద్యమం వంటి అనేక ఉద్యమాల వల్ల ఎక్కువ మంది ప్రజల మాతృభాష అయిన తెలుగు ద్వారా విద్యావ్యాప్తికి ప్రయత్నాలు జరిగాయి. బ్రిటిషు వారు అధికారాన్ని ఏకీకృతం! చేయడంతో, దేశాన్ని పరిపాలించడంలో ఆంగ్ల భాష చాలా ఉపయోగపడుతుందనే విషయాన్ని బ్రిటిష్ వారు గుర్తించారు.



భారతదేశంలో విద్య పరిణామంలో ముఖ్యమైన మైలురాళ్లలో ఒకటి 1835లో లార్డ్ థామస్ బాబింగ్టన్ మెకాలే మినిట్ ఆన్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టడం అని చెప్పవచ్చు. పాశ్చాత్య విద్యను, ప్రత్యేకంగా ఆంగ్ల భాష, సాహిత్యాన్ని ప్రోత్సహించడాన్ని మెకాలే నొక్కిచెప్పారు. దాంతో మెకాలే కాలంలో ఆంగ్ల విద్యకు ప్రాధాన్యత పెరిగింది. ఆంగ్ల పాఠశాలలు ప్రారంభించారు. ఉన్నత విద్యకు ఆంగ్ల భాష బోధనా మాధ్యమంగా మారింది. 19వ శతాబ్దంలో భారతీయ విద్యలో మరో ముఖ్యమైన అభివృద్ధి 1854లో వుడ్స్ డెస్పాచ్‌ను ప్రవేశ పెట్టారు. డెస్పాచ్ విద్యా విభాగాలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, విశ్వవిద్యాలయాల స్థాపన ప్రాముఖ్యతను వుడ్స్ డెస్పాచ్ నొక్కి చెప్పింది. ఆంగ్ల విద్యకు ప్రాధాన్యత ఉన్నప్పటికీ, భారతీయులలో ప్రాంతీయ విద్యకు డిమాండ్ బాగా పెరిగింది.



19వ శతాబ్దంలో భారతదేశం బ్రహ్మ సమాజం, ఆర్యసమాజం, అలీఘర్ ఉద్యమం ఇత్యాది సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలను కూడా చూసింది. ఈ సంస్కర్తలు సంప్రదాయ భారతీయ జ్ఞానాన్ని ఆధునిక పాశ్చాత్య విద్యతో మిళితం చేసే విద్య కోసం వాదించారు. వారు సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి, స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి, శాస్త్రీయ విజ్ఞాన వ్యాప్తిని ప్రోత్సహించడానికి ప్రయత్నించారు. ఈ కాలంలో క్రైస్తవ మిషనరీలు కూడా విద్యలో గణనీయమైన పాత్ర పోషించాయి. 19వ శతాబ్దపు విద్యావిధానం ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు అందుబాటులో లేకుండా పోయింది. విద్య ప్రధానంగా పట్టణ కేంద్రాలు, ప్రత్యేక వర్గాలకు పరిమితమైంది.

**తెలుగు రాష్ట్రాలలో..**

ఇలా అనేక మార్పులు జరుగుతూ నేడు విద్య అందరికీ చేరువైంది. మనదేశంలో సుమారు 15లక్షల పాఠశాలల్లో 25కోట్లకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో మొత్తం 58,950 పాఠశాలలు ఉండగా, వీటిలో 44,617 ప్రభుత్వ పాఠశాలలు, 13,249 ప్రైవేట్ పాఠశాలలు, ఇంకా ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు కూడా ఉన్నాయి. పది మంది కంటే తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలు 5,520, 20మంది కంటే తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలు 8,072గా గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల సంఖ్య 35,14,948, ఎయిడెడ్ విద్యార్థుల సంఖ్య 92,579, ప్రైవేటు విద్యార్థుల సంఖ్య 34,15,948, ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఖ్య 1,87,996, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సంఖ్య 3,396 అని అంచనా. పాఠశాల విద్యాశాఖ (ఆంధ్రప్రదేశ్) ప్రాథమిక స్థాయి పూర్తిగా, మాధ్యమిక స్థాయి పాక్షికంగా అనగా 1నుండి 10వ తరగతుల వరకు విద్యావ్యవస్థని నిర్వహిస్తుంది. ఇది విద్యార్థులందరికీ మెరుగైన ప్రవేశం కల్పించడం, నమోదు, నిలుపుదలని ప్రోత్సహించడం, అందరికీ సమాన విద్య అవకాశాలను, నాణ్యత, పాఠశాల మౌలిక సదుపాయాలను అందించడం ధ్యేయంగా పనిచేస్తుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు 100 శాతం ఆధార్ అనుసంధానం చేయడం జరిగింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల'ను ప్రారంభించారు. 'విందాం నేర్చుకుందాం' (రేడియో పాఠాలు), 'మీనా ప్రపంచం' (రేడియో ప్రోగ్రామ్), 'వీడియో పాఠాలు' లాంటి దృశ్య, శ్రవణ బోధనా పద్ధతుల ద్వారా విద్య నేర్పడం జరుగుతున్నది. డిజిటలీకరణలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వేలిముద్రల ద్వారా నమోదు చేస్తున్నారు. 'బడి పిలుస్తోంది' అనే ప్రచార కార్యక్రమం ద్వారా విద్య అనేది ప్రతి బిడ్డకు హక్కు అని ప్రజలలో అవగాహన కల్పించడం, ఉచితంగా మధ్యాహ్న భోజనం, ఏకరూప వస్త్రాలు, పుస్తకాలు అందిస్తున్నారు. తెలంగాణలోని మొత్తం 26,101 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 1,06,641మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. తెలంగాణలో సుమారు 60 లక్షల మంది పాఠశాల విద్యాభ్యాసం చేస్తుంటే 35 లక్షలమంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనూ, 25లక్షలమంది ప్రైవేటు పాఠశాలల్లోనూ విద్యాభ్యాసం చేస్తున్నారు. గత పది సంవత్సరాలతో పోలిస్తే ప్రతి సంవత్సరం సుమారు 3 శాతం మంది చొప్పున ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తుంది. 10 సంవత్సరాల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో 87 శాతం పిల్లలు ఉంటే ప్రైవేటు పాఠశాలల్లో 13 శాతం పిల్లలు ఉన్నారు. నేడు సుమారు 55 శాతం మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటే ప్రైవేటు పాఠశాలల్లో 45 శాతం మంది పిల్లలు ఉన్నారు.



తెలంగాణలోని 272 పాఠశాలల్లో 501 నుంచి 750 మధ్య పిల్లలు ఉండగా, 85 పాఠశాలల్లో 750 మంది విద్యార్థులు ఉన్నారు. ఇదిలా ఉండగా కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే చేరిన పాఠశాలల సంఖ్య 53 ఉండగా, టీచర్లు 51 మంది ఉన్నారు. ఇలా ఈ విద్యాసంవత్సరంలో పది మందిలోపు విద్యార్థులు చేరిన పాఠశాలలు మొత్తం 4324 ఉన్నాయి. అందులో మొత్తం 3326 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. జీరో ఎన్రోల్‌మెంట్ ఉన్న ప్రైమరీ పాఠశాలల సంఖ్య 1818 కాగా అందులో ఉపాధ్యాయులు 517 మంది ఉన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 48 ఉండగా ఉపాధ్యాయులు 33 మంది, హైస్కూళ్ళు 33 ఉండగా ఉపాధ్యాయులు 30 మంది ఉన్నారు. ప్రాథమిక స్థాయి పూర్తి చేసిన పిల్లల్లో కనీసం చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు చేయలేని పిల్లల సంఖ్య 40 శాతం ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇటువంటి సంఘటనలు తల్లిదండ్రులతో పాటు పిల్లల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా చేసి, పైతరగతులకు వెళ్ళలేమనే భావనతో బడి వదలి వెళ్ళిపోతున్నారు.



### ప్రైవేటు పాఠశాలలవైపు మొగ్గు


ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నవారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది. దేశంలో ప్రైవేటు పాఠశాలలు అధికంగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ 9వ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని యునిఫైడ్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడీఐఎఫ్ ఈప్లస్)నివేదిక వెల్లడించింది. ఈ నివేదికను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ప్రైవేటు విద్యాసంస్థలతో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చాలా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలని,




భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా సిలబస్ రూపొందించాలని, సిలబస్ కోసం విద్యారంగ నిపుణులు, మేధావులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని, వచ్చే 10, 20యేళ్లకు ఏమి అవసరం ఉంటుందో గుర్తించి బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని తెలుగు రాష్ట్రాల పాలకులు భావిస్తున్నారు. బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలని, ఒక్కరు కూడా బయట ఉండటానికి వీలులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రైవేటుస్కూళ్ల తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా పేరెంట్, టీచర్ మీటింగ్‌లను నిర్వహించాలని నిర్ణయించడమే కాక కొన్ని చోట్ల ప్రారంభించారు కూడా. ఎన్ని పయత్నాలు చేసినా పెద్ద సంఖ్యలో డ్రాపౌట్స్ పెరుగుతూనే ఉన్నారు. వేలకు వేలు ఫీజులు కట్టి ప్రైవేటు పాఠశాలల్లో చేరడానికి ఆసక్తిని కనబరుస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది.

### ప్రభుత్వ పాఠశాలల్లో కొన్ని లోపాలు

ఆర్థిక కారణాల వల్ల కొందరు చదువును మధ్యలోనే నిలిపి వేస్తుంటే, ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన బాగుంది అని భావించిన అనేకమంది తల్లిదండ్రులు చాలీచాలని ఆదాయం ఉన్నప్పటికీ తినీ తినక వేలాది రూపాయల ఫీజు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్నీ ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలవైపు తల్లి దండ్రులు ఎందుకు మొగ్గు చూపుతున్నారు? అనే విషయమై పరిశీలకులు కొన్ని అభిప్రాయాలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాలకు పెద్దపీట వేయకపోవడం, కేవలం తరగతి పుస్తకాల వరకే పరిధి నిర్దేశించడం, కొత్తదనానికి అవకాశం ఇవ్వక కదుపులో చల్ల కదలకుండా ఉండాలని నేర్పడం, ఏదో ఒక కారణానికి భయపడి మన చరిత్రను మనమే మార్చి, తప్పుగా పిల్లలకు నేర్పడం, ప్రశ్నించే తత్వాన్ని పిల్లలకు నేర్పకపోగా,ప్రశ్నించిన చిన్నారులను వెధవ ప్రశ్నలు అపు అని భయపెట్టడం, కొత్త విధానాలను పరిశీలించి మన విధానాన్ని సరిదిద్దకపోవడం, చాలామంది గురువులు కేవలం ఉద్యోగం కోసమే ఉపాధ్యాయ వృత్తిలో చేరడం తప్ప, విద్య నేర్పాలి అనే దృక్పథం లేకపోవడం, దేశానికి అవసరమైన చదువుల్లో తర్ఫీదు ఇవ్వకపోవడం, ఎక్కువమంది ప్రభుత్వ ఉపాధ్యాయులలో జవాబుదారితనం లేకపోవడం ఇలా చెప్పుకుంటూ పోతే అనేక లోపాలను పరిశీలకులు ఎత్తి చూపుతున్నారు. ప్రపంచంలో తొలి విశ్వవిద్యాలయాన్ని మనదేశంలోనే స్థాపించారని ఇప్పటికీ అందరంగర్వంగా చెప్పుకుంటున్నాము. ఆస్థాయిలో కాకపోయినా నేటితరం పిల్లల ఆశయాలకు, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నారా?



లేదా? అనేది పరిశీలించాలి. ఆ కారణంగానే నేడు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను ప్రభుత్వ బడులలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. తల్లిదండ్రుల ద్వారా లోపాలను తెలుసుకొని సరిదిదద్దడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మార్పులు చేసి నాణ్యమైన విద్యను అందించవచ్చు. విద్యార్థి దశలోనే నైతిక ప్రవర్తన బాగు చెయ్యలేకపోతే వ్యవస్థ ఎప్పటికీ బాగుపడదు. విపరీతమైన ఖర్చు తప్ప ప్రయోజనం ఉండదు.



విద్యా వ్యవస్థలో మార్పు రావలసిన అవసరం ఉంది. వృత్తిపరమైన నైపుణ్యాలు నేర్పించాలి. బాలకార్మికులను బడిలో చేర్పించడానికి ఇప్పుడు అనుసరిస్తున్న చట్టాల వల్ల సరియైన స్పందన రావడం లేదు. అందువల్ల మంచి వ్యవస్థను తయారు చేయుటకు సలహాలు ఇస్తూ బడికి పోవలసిన పిల్లలను పనిలో పెట్టుకొని వెట్టిచాకిరి చేయించుకుంటున్న వారిని కఠినంగా శిక్షించిన సంఘటనలు తక్కువగా కనిపిస్తున్నాయి. శిక్షలు పడకపోవడము వలన కొందరు పదే పదే వెట్టి చాకిరీ చేపించుకుంటున్నారు. శిక్షలు అమలు అయ్యేవిధంగా చట్టాలు కఠినంగా తెస్తూ బాలకార్మికులను బడిలో చేర్చించుటకు ప్రతిపౌరుడూ బాధ్యత తీసుకునేలా చూడాలి. ముఖ్యంగా ఇటుకలు తయారుచేసే బట్టీల దగ్గర తల్లిదండ్రులు పనిచేయడమే కాకుండా వారి పిల్లలను కూడా బడికి పంపకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారు. వారి తల్లిదండ్రులతో పాటు ఇటుక బట్టీలను నిర్వహిస్తున్న యజమానులకు కూడా పిల్లలను పనిచేయకుండా చదువు కోవాలి అని చెప్పే విధముగా అధికారులు వారిని సంప్రదించి కఠినంగా బాధ్యత తీసుకోవాలి.



### మౌలిక సదుపాయలు పెంచాలి

ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు అందిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా మౌలిక సదుపాయాలు పెంచవలసిన అవసరం ఉంది. పలు రంగాల అభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉంది. వ్యవసాయం, ఆర్థికం, పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం ఇత్యాది రంగాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విద్యతోనే అనుసంధానమై ఉన్నాయి. అందువల్ల పాఠశాల దశ నుండే చక్కటి ప్రణాళికలు రూపొందించాలి. కార్యాచరణ అనేది సమర్థవంతంగా ఉండాలి. ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెరిగేలా చూడాలి. ప్రభుత్వం ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలి. విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులకు తగిన శిక్షణనివ్వాలి. పిల్లల నిష్పత్తికి తగిన విధంగా ఉపాధ్యాయులను భర్తీ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పన చేయాలి. నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ కోసం శాశ్వత మండల విద్యా శాఖ అధికారుల నియామకం జరగాలి. ప్రైవేటు పాఠశాలల్లో విద్యా బోధన ఎలా జరుగుతుందనే విషయాన్ని సి.సి. కెమెరాల ద్వారా కూడా పర్యవేక్షిస్తున్నారు. అదేరీతిలో ప్రభుత్వ పాఠశాలల్లో సి.సి. కెమెరాలు పెట్టి విద్యాబోధన ఎలా చేస్తున్నారనే విషయాన్ని అధికారులు పరిశీలించి జవాబుదారీతనం లేనివారిపై చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అధికారులు తమ విద్యా బోధనలోని లోపాలను గమనిస్తున్నారనే బెరుకుతో విద్యా బోధనలో మెరుగైన ఫలితాలు రావచ్చు. డ్రాపౌట్ల సంఖ్య తగ్గించడానికి స్థానిక పెద్దలు, నాయకుల సహాయం తీసుకొని పిల్లల తల్లిదండ్రులకు విద్య విలువ తెలియజేయాలి. పిల్లలకు సకాలంలో ఉపకార వేతనాలు అందించి ప్రోత్సహించాలి. పట్టణాలతో పాటు పల్లెల్లో సైతం డిజిటల్ టెక్నాలజీతో తరగతులను నిర్వహించాలి. డ్రాపౌట్ అనేది మౌలిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలతో ప్రభావితమై ఉంది. వీటిని పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో అనే నినాదంతో పాటు నేను బడికి పోతాను అనే కార్యక్రమాలు కూడా ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్నాయి. తెలంగాణాలో ఏటా లక్షన్నర మంది ప్రభుత్వ పాఠశాలలు మానేస్తున్నారని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తుంది. ఇదే కొనసాగితే ప్రభుత్వ బడులు మూతవేయవలసి వస్తుంది. ఇలా పాఠశాలలు మానేసిన వారిలో ఎక్కువ మంది పేద కుటుంబాలకు చెందినవారే. వీరు మధ్యలోనే చదువు నిలిపివేస్తున్నారు. డ్రాపౌట్ల సంఖ్యను తెలియజేయడానికి ఏ ప్రభుత్వం ఇష్టపడటంలేదు. ప్రభుత్వపాఠశాలలు చాలా గొప్పగా ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నడుస్తున్నాయంటూ గొప్పలు చెబుతుంటారు.అయినప్పటికీ అసలు నిజాలు మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియడం వల్ల విమర్శలు వెల్లువలా ముంచెత్తుతున్నాయి.

### విద్యా బోధనలో మార్పులు రావాలి

అంగట్లో అన్నీ ఉన్నాయి అల్లుడినోట్లో శని ఉన్నట్లు మనకు చాలా వనరులు ఉన్నప్పటికీ వాటిని సరిగా సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతున్నాము. జీవితంలో వెళ్ళాక వారు బ్రతకడానికి అవసరమైన విధంగా విద్యాబోధనలో మార్పు రావాలి. విద్యాభ్యాసం చేసిన ప్రతిఒక్కరూ సంపద సృష్టికర్తలు కావాలి. ఒక దినపత్రిక వారు ఒకానొక సందర్భంలో నిత్య జీవితంలో ఉపయోగించే పది తెలుగు పదాలు చెప్పి వాటి అర్థాలు అడిగితే పాఠశాలల్లో



చదివే ఒక్క విద్యార్థి కూడా చెప్పలేక పోయాడు. గడియారం చూసి సమయం ఎంత అని అడిగితే నోరెళ్ళబెట్టే పిల్లలు ఉన్నారు. ఏ సిలబస్ చదవాలి? ఏ మాధ్యమంలో చదవాలి? ఏపుస్తకాలు చదవాలి? పిల్లలకు ఏ విధంగా బోధించాలి? నేటి పాలకులకు అనుకూలంగా చరిత్రను ఎలా తిరగరాయాలి? అని మీనమేషాలు లెక్కేసుకుంటున్నారు తప్పితే అసలు పిల్లవాడికి అర్థమవుతుందా? లేదా? నేర్చుకుంటున్నాడా? లేదా? అనే విషయాన్ని గాలికి ఒదిలేస్తున్నారు. ఒక భవనం పటిష్టంగా ఉండాలంటే పునాది గట్టిగా ఉండాలి. అదేవిధంగా విద్యా పునాది అనేది దృఢంగా ఉంటే విద్యార్థి విద్యా పయనం నల్లేరు పై నడకలా సాగుతుంది. ప్రతిరోజు పిల్లల్ని క్రీడలు ఆడించి వారిని మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారుచేయాలి. ఫోన్లు, విద్యుచ్ఛక్తి వంటి సదుపాయాలు లేనప్పుడే పిల్లలు విద్యాభ్యాసంలో రాణించారు. నైతిక విలువల్ని నేర్చుకున్నారు. నేడు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో పెరిగింది. దాన్ని దుర్వినియోగం చేయకుండా విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారిని ప్రేరేపించాలి. కేవలం డిజిటల్ తరగతులు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల విద్యావ్యవస్థలో మార్పులు రావు,



పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలి. బండెడు పుస్తకాలు పిల్లలు మోస్తున్నప్పటికీ సంస్కారం, విలువలు బోధించే పాఠ్యాంశాలు తగ్గుతున్నాయి. భారతీయుల విలువలు ప్రపంచానికి ఆదర్శంగా ఉన్నాయి. ఇతర దేశాల సంస్కృతి నుండి మంచిని గ్రహించి మనదేశ సంస్కృతిని కాపాడుకుంటూ విద్యా బోధన జరగాలి. నేడు సమాజంలో అధికారం, ధనం, అహంకారం ముందు మంచితనం వీగిపోతుంది. యాంత్రికంగా మారిన చదువుల వల్ల విలువలు పడిపోతున్నాయి. మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్నాయి. యువత చదువుకున్న తరువాత ఉద్యోగాలు చేస్తూ డబ్బు సంపాదించే యంత్రాలుగా మారిపోయారు. మితిమీరిన ధనార్జన వల్ల అహంకారం పెరిగి పెద్ద, చిన్నా తేడాలేకుండా మానవత్వం మంటకలుస్తుంది. విద్య ద్వారా యువత చైతన్యమవుతుందని, విద్య ద్వారా జాతికి జవసత్వాలు సిద్ధిస్తాయని విద్యా ప్రాధాన్యతను చాటి చెప్పిన స్వామి వివేకానందుని స్ఫూర్తిని విద్యా రంగంలో నింపాలి, వినయం, వివేకం, సంస్కారం, సామాజిక స్పృహను కలిగించే రీతిలో పాఠ్యాంశాలలో మార్పు రావాలి. ధనమే పరమావధి అనే ధోరణిని మార్చి దిగజారుతున్న విలువలను విద్య ద్వారా సంస్కరించాలి. బట్టీ విధానాన్ని స్వస్తి పలికి అర్థవంతంగా విద్యను నేర్చుకునేలా చేయాలి. పాఠశాల జ్ఞానాన్ని నిత్యజీవిత సన్నివేశాలలో అన్వయించుకునేలా చేయాలి. అభ్యసన అనేది పాఠ్య పుస్తకానికే పరిమితం



కారాదు. బాహ్యప్రపంచం, పరిసరాల ఆధారంగా అన్వేషణ, పరిశీలన అభ్యసనలో కీలకం కావాలి. క్షేత్ర పర్యటనలో భాగంగా బాలబాలికలను పలు ప్రాంతాలకు తీసుకుని వెళ్ళాలి. నేడు ఉన్నత వర్గాల పిల్లలకు ఒక రకమైన చదువు, మధ్యతరగతి వారికి వేరొకరకం, అట్టడుగు వర్గాల వారికి ఇంకోరకం విద్య లభిస్తుంది. దళిత, బలహీన వర్గాల పిల్లలకే ప్రభుత్వ పాఠశాలలు అనే భావన స్థిరపడింది. ఇటువంటి వాటిలో మార్పు రావాలి. ప్రతి ఒక్కరికీ ఉచితంగా నాణ్యమైన విద్య లభించాలి. పాఠశాల విద్యలో అశాస్త్రీయ విధానాలకు తెరదించి అర్థవంతంగా చదువుకునే విధంగా అభ్యసనాన్ని మెరుగుపరచాలి. పిల్లలు తమకున్న సహజమైన శక్తిసామర్థ్యాల ఆధారంగా నేర్చుకునేలా దృష్టి పెట్టాలి. జ్ఞానాన్ని పాఠశాల వెలుపలి జీవితంతో అనుసంధానం చేయాలి. పిల్లల సమగ్రాభివృద్ధికోసం విద్యా ప్రణాళికలు రూపొందించాలి. నిరంతరం సమగ్ర మూల్యాంకనాన్ని అమలు చేయడం ద్వారా పరీక్షలను సరళీకరించి, బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయాలి. పిల్లలు ఎంత నేర్చుకున్నారు అని తెలుసుకోవడానికి మూల్యాంకనం చేయడానికి బదులు పిల్లలు నేర్చుకోవడానికి దోహదపడేలా మూల్యాంకన విధానాలను సంస్కరించాలి. తల్లిదండ్రుల సొంత ఆలోచనలను పిల్లలపై రుద్ద కూడదు. పిల్లల ఆత్మలు రేపటి ప్రపంచంకోసం తపిస్తుంటాయి. తల్లిదండ్రులు విల్లు అయితే పిల్లలు అందులో నుండి దూసుకువెళ్ళే బాణాలని గుర్తించండి. నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయింది. ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్ అందుబాటులోకి రాబోతుంది. అణుబాంబు విపత్తుకు గురైన జపాన్ దేశం కోలుకుని విద్యలో ముందంజలో ఉంది. చాలా దేశాలలో విద్య, వైద్య ఉచితంగా అందిస్తున్నారు. మనదేశంలో ఇవి వ్యాపారంగా మారి అందరకీ నాణ్యమైన విద్య లభించడం అనేది అందని ద్రాక్షలానే తయారైంది. కాబట్టి పాలకులు పూనుకుని ప్రపంచదేశాలతో పోటీపడే విధంగా మన విద్యా విధానంలో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. •



# ఊరగాయ

ఆర్.సి.కృష్ణస్వామిరాజు

సింగిల్ పేజీ కథ



కొడుకు ప్రణవ కృష్ణ పోస్ట్ ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగం చేసేది ఏలూరులో కాబట్టి అక్కడే కొత్త కాపురం పెట్టాడు. పెళ్లై ఆరు నెలలైనా కోడలు పుల్ల మామిడికాయ కావాలని అత్త వేదలక్ష్మిని అడగలేదు.

"ఈ కాలం పిల్లోల్లకి మనం చెప్పేదేముంది? కక్కొచ్చినా, కళ్యాణమొచ్చినా ఆగదు కదా!" అని తనకు తానే సర్ది చెప్పుకుంది కొడుకూ కోడలూ, ఎలా ఉన్నారోనని వేదలక్ష్మి ఓ రోజు, గంట ప్రయాణమున్న ఏలూరుకు నూజివీడు నుంచి బస్సులో వెళ్లింది.

అత్తని నవ్వుతూ ఆహ్వానించింది కోడలు పూర్ణతిలక. అత్తగారికి చల్లటి ఫ్రిజ్‌నీళ్ల ఇచ్చి మంచి చెడ్డలు మాట్లాడింది.

ఇంతలో కొడుకు ప్రణవ కృష్ణ ఆఫీసు నుంచి భోజనానికి వచ్చాడు. అమ్మని పలకరించి, అవీ ఇవీ మాట్లాడి భోజనానికి కూర్చున్నాడు.

ఇంటి వెనుకనున్న అరటిచెట్టు నుంచి కొన ఆకు కోసుకొచ్చి అందులో అన్నం, పప్పు వడ్డిస్తోంది పూర్ణ తిలక. కోడలు ఎలా వడ్డిస్తోందో చూస్తూ కూర్చుంది వేదలక్ష్మి.

వంటలతో పాటు ఊరగాయ కూడా వడ్డించింది కోడలు.

ఆశ్చర్యంగా చూసింది అత్త.

"పెళ్లి కాకముందు నా బిడ్డ ఊరగాయ ఊసే ఎత్తేవాడు కాదు కదా, ఇప్పుడెందుకు అలవాటు చేసుకున్నాడో?" అని ఆలోచనలు మొదలైనాయి వేదలక్ష్మికి.

గబగబా తినేసి ఆఫీసులో అర్జెంటు పని ఉందని వెళ్లిపోయాడు ప్రణవ కృష్ణ.

"ఎప్పటినుంచి ఊరగాయని ఇష్టపడుతున్నాడు?" అని అడిగింది అత్త.

"ఇక్కడ కాపురం పెట్టినరోజు నుంచీ ఊరగాయ లేనిదే భోజనానికి కూర్చోవడం లేదు" అని బదులిచ్చింది.

ఆయనకి ఇష్టమని సూపర్ మార్కెట్ నుంచి తను తెచ్చిన ఊరగాయలన్నీ చూపించింది కోడలు.

"వెల్లుల్లి వేసిన ఊరగాయలే ఆయనకి నచ్చుతాయి. వెల్లుల్లి వేయని ఊరగాయను ఎడమ చేత్తో కూడా తాకడు" అని చేతి గాజులు ఆడిస్తూ చెప్పింది.

అత్త ముఖం మాడిన గోంగూర పచ్చడిలాగా తయారయినయంది. చిన్నగా బ్యాగు సర్దుకుని "నేను వెళ్లొస్తాను" అని చెప్పింది.

"పది రోజులైనా ఉంటారని అనుకున్నాను. అప్పుడే వెళ్లిపోతారా అత్తయ్యా? కనీసం భోజనం చేసైనా వెళ్లండి" అని బతిమిలాడింది కోడలు.

"కడుపు నిండుగా ఉంది, నేను వెళ్లొస్తా" అని చెప్పి ఆటో పెట్టుకుని బస్టాండుకు సత్వరున వెళ్లిపోయింది.

అత్త ఎందుకు వెంటనే వెళ్లిపోయిందో అర్థం కాలేదు కోడలికి. ఊరగాయ గురించి ఎందుకు అలా అడిగిందో కూడా అర్థం కాలేదు.

ఊరగాయ తింటే నష్టాలేమిటో కనుక్కోడానికి తన క్లాస్‌మేట్‌కి ఫోన్ చేసింది. యూనివర్సిటీలో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సబ్జెక్టులో రీసెర్చ్ చేస్తోంది ఆ మిత్రురాలు.

"ఎంత ఊరగాయ తింటున్నాడు? ఎన్ని సార్లు తింటున్నాడు? ఏయే వేళల్లో తింటున్నాడు? ఏ రకం ఊరగాయలు ఆయనకు నచ్చుతాయి? ఏ కంపెనీ బ్రాండ్‌లు ఇష్టపడుతున్నాడు? ముక్కలు తింటున్నాడా? అందులోని జ్యూస్ తింటున్నాడా?" లాంటి ప్రశ్నలు వేసి సమాధానం రాబట్టింది.

కంప్యూటర్ ముందు కూర్చుని జిగ్ జాగ్ లెక్కలు కొన్ని వేసి, ఆయన తినే ఊరగాయ మోతాదు వల్ల అతడి ఆరోగ్యానికి ఎలాంటి డోకా లేదని గంట కొట్టినట్లు చెప్పింది మిత్రురాలు.

అయినా పూర్ణతిలక మనసు శాంతించలేదు. వెంటనే అమ్మకి ఫోన్ చేసి చెప్పింది.

ఇంటికొచ్చిన అత్త "చేయి కడుక్కోకనే" పరుగులు తీసిందని, కొడుకు తినే ఊరగాయ విషయం కూడా ఆరా తీసిందని చెప్పింది.

నూజివీడులోని ఒకే వీధిలో ఉంటున్న వియ్యంకురాలి ఇంటికి పరుగులు తీసింది పూర్ణ తిలక తల్లి.

అప్పుడు బస్సు దిగిన వేదలక్ష్మి, పూర్ణ తిలకని గట్టిగా వాటేసుకుని ఇలా చెప్పింది.

"నీ కూతురు వండే వంటల్లో ఉప్పూ, కారం సరిగా వేయడం లేదు. అందుకే నా కొడుకు ఊరగాయలకు మరిగినాడు. ఉప్పూ, కారం తింటేనే కదా పిల్లోల్లకి బలం ఉండేది. వాడు నిక్కరేసుకున్న రోజు నుంచి తాళి కట్టే వయసొచ్చేంత వరకు ఊరగాయ ముఖం చూసినోడు కాదు. అట్లాంటిది పెళ్లయ్యాక మారిపోయాడు" అని ఎగిరెగిరి చెప్పింది.

"అయ్యో..! అవునా? నాకు విషయమే తెలియదు. అయినా అల్లుడు ఆ విషయాన్ని, నా కూతురితో చెప్పొచ్చు కదా!" అని అడిగింది పూర్ణ తిలక తల్లి.

"మా వాడికి మొహమాటం జాస్తి. కొత్త పెళ్లాం కదా, ఒకటి చెప్పినా ఎక్కువ, రెండు చెప్పినా తక్కువ. అందుకని చెప్పి ఉండడు" అని ముక్కు బలంగా చీదింది.

వెంటనే పూర్ణ తిలకానికి వీడియో ఫోన్ కాల్ చేసింది తల్లి "ఉప్పూ, కారం బాగా వేసి వంటలు చేయి. మీ ఇంటాయనకు ఊరగాయలు వడ్డించేది తగ్గించు. అంతా సర్దుకుంటుంది" అని చెప్పింది.

సరేనని గట్టిగా తల ఊపింది పూర్ణతిలక. మూడు నెలలకే వేదలక్ష్మికి కోడలి నుంచి ఫోన్ కాల్ వచ్చింది.

"నూజివీడులో పుల్లటి మామిడికాయలు కేజీ ధర ఎంత అత్తయ్యా?" అని.

"కేజీ ఏముంది? బస్తానే తెస్తాను" అని చీర కొంగు నడుముకు చుట్టి అప్పటికప్పుడు ఏలూరు బయలుదేరింది వేదలక్ష్మి.

ఈ వారం కవిత్వం

## మీఠాపాన్ దోస్తానా!!

పండగ భోజనం కాగానే పాన్‌దాన్ ఆహ్వానిస్తుంది
ఆయాసం మరిచేలా నోటిలో తాంబూలం రాజ్యం
నమిలినాకొద్ది మిఠాపాన్ నాల్కపై చెలిమె చెలిమె
ఎరుపు రంగుతో నాల్కకు మేకప్ చేస్తుంది మీఠాపాన్.

కోపిష్టి సైతం తియ్యటి తాంబూలం నమిలితే
మధురం కోపాన్ని మటుమాయం చేస్తుంది
ఆలు మగల అలకలు అటకెక్కిపోతాయి
మీఠాపాన్ ఇంద్రజాలం.

ఇచ్చిన పాన్ నమిలినాక దుష్మన్ బీ దోస్త్
మీఠాపాన్ మాయలో పడితే మాటలే మాటలు
అలుగు వారినట్లు ఆశువుగా పద్య పఠనం
"వహ్వా" పదాల ముషాయిరా.

మీఠాపాన్‌లు కట్టించే
చిన్న పాన్ కోకా సైతం అంగడంగడే
దసరా రంజాన్ పండగ లెక్క సందడి.

అందరూ మీఠాపాన్ అభిమానులే
కులం లేదు మతం లేదు ప్రాంతం లేదు
అందరి నోట మీఠాపాన్ షోకు.

**- కందాళై రాఘవాచార్య**



## ఖాళీ కాలం

కాలం మింగింది మనల్ని
ఏ అరణ్యాల మధ్య ఖాళీలో వదిలింది
గుర్తుగా ఒక ఈకను ఉంచి వెళ్లింది
గతం తాలూకు లెక్కలన్నీ కట్టాలి
ఇప్పుడు
గడిపిన భారాన్ని తేల్చాలి ఇప్పుడు



జ్ఞాన సంద్రంలో నీటిమట్టం పెరిగింది
అజ్ఞానపు పలకలు కరిగి
కుప్పలు తెప్పలు పడుతున్నాయి
పక్షుల రెక్కల్లా వలస వచ్చిన మేఘం
ఒకటి
నెత్తిన ఆవరించి చేరింది
విద్యుత్ తరంగాలు నరాలకు తగిలి
ఘాతాన్ని ఇస్తాయా
మార్పు ధ్వనులను ఉరుములను
చేరవేస్తూ..
ఇది ఒక రసాయన చర్య
చెత్త నుంచి చెరుకు గడ్డలను తీసే
ప్రక్రియ
బంగారు తీగలు అల్లుతూ
ముక్కుతో ఒక ఉష్ణపక్షి తీసుకెళ్తుంది
మోసుకుంటూ సిగ్నల్స్‌ని..
కాలం మళ్లీ విముక్తున్ని చేసే లోపు
ఎప్పుడు వస్తుంది అసలు?
వస్తుందా వెళ్లిందా అయిపోయింది
ఇక మిగలకుండా!!

**- రఘు వగ్గు**

## సాహిత్య సవ్వడులు

చిన్నారుల ముద్దు పలుకులు
ముచ్చట కొలుపుతాయి.
కోకిలల కమ్మని కూతలు
కర్ణాలకింపు కలిగిస్తాయి.
చిలుకల చక్కెర పలుకులు
చెవుల సంబరపరుస్తాయి.
గాంధర్వ గానాలు
మదుల మురిపించుతాయి.
చెలియ గుసగుసలు
హృదయాల పరవశపరుస్తాయి.
ప్రేమ పలకరింపులు
మనసుల పులకిరంపచేస్తాయి.
చినుకుల చిటపటలు
చెప్పలేని హాయి చేకూరుస్తాయి.
గాయకుల శ్రావ్య స్వరాలు
శ్రోతల సంతసపరుస్తాయి.

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

### సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. *sunmagvaargtha@gmail.com*

ఈ కాలంలో ఉసిరి వంటకాలకి రెడ్ కార్పెట్ పరిచేస్తాం కదా! ఈసారి కూడా వగరు ఉసిరికి కాస్త తీపి, మరికాస్త ఘాటు, ఇంకాస్త కమ్మదనం కలిపేసి భిన్నమైన వంటకాలు చేసేద్దాం!

# ఉసిరి రుచులు

## నువ్వుల పచ్చడి..



**కావాల్సినవి:** ఉసిరికాయలు 500గ్రా, పచ్చిమిర్చి 150గ్రా, నువ్వులు 50గ్రా, జీలకర్ర చెంచా, ఆవాలు చెంచా, ఉప్పు 100గ్రా, పసుపు తగినంత, మెంతులు పావు చెంచా, వెల్లుల్లిపాయ ఒకటి, ఇంగువ పావు చెంచా, 200గ్రా.

**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసి తడి లేకుండా తుడుచుకోవాలి. జీలకర్ర, మెంతులు, ఆవాలు, నువ్వులని పొడిగా వేయించుకుని, చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడికొట్టుకోవాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లిపాయ రెబ్బల్ని విడిగా, విడిగా మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. వెడల్పాటి పాన్లో నూనె పోసి.. వేడెక్కాక ఉసిరికాయల్ని వేసి చిన్నమంట మీద పచ్చి లేకుండా మగ్గించుకుని పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో ముందుగా చేసి పెట్టుకున్న నువ్వుల పొడి, పచ్చిమిర్చి పేస్ట్, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, ఉప్పు వేసుకుని నూనెలో మగ్గించుకోవాలి. గరిటెతో కలుపుతూ ఉంటే కాసేపటికి నూనె వేరవుతూ ఉంటుంది. అప్పుడు వేయించి పెట్టుకున్న ఉసిరికాయల్ని కూడా వేసి మరో పది నిమిషాలన్నా మగ్గించుకుంటే పచ్చడి సిద్ధం.

## సాల్ట్ క్యాండీలు


**కావాల్సినవి:** ఉసిరికాయలు అరకేజీ, పంచదార రెండు చెంచాలు, ఉప్పు తగినంత.

**తయారీ:** ఉసిరికాయల్ని కడిగి శుభ్రం చేసి, తడి లేకుండా తుడిచి కవర్లో ఉంచి డీప్ ఫ్రిజ్లో పెట్టాలి. ఒక రోజు తర్వాత వీటిని తీస్తే పెద్దగా శ్రమ లేకుండా చాకుతో క్యాండీలకు కావాల్సిన విధంగా ముక్కలు చేసుకోవచ్చు. ఇప్పుడా ఆమ్లా ముక్కలపై మనకి కావాల్సిన పరిమాణంలో ఉప్పు వేసుకోవాలి. ఉప్పు మరీ ఎక్కువగా ఉన్నా తినలేం. కాబట్టి కాస్త తగ్గించి వేసుకుంటే మేలు. ఆపై పంచదారని కూడా వేసుకుని బాగా కలపాలి. మరుసటి రోజుకి ఈ ముక్కలు బాగా ఊరతాయి. ఆ తర్వాత నాలుగు రోజులు ఎండలో ఉంచితే సాల్ట్ క్యాండీస్ సిద్ధమవుతాయి. ఈ ముక్కలతో ఉసిరి పులిహోర చేసుకోవచ్చు. పప్పులో వేసుకున్నా రుచిగా ఉంటాయి.



## కొబ్బరి పచ్చడి..

**కావాల్సినవి:** ఉసిరికాయలు ఐదు, కొబ్బరికోరు కప్పు, పచ్చిమిర్చి నాలుగు, జీలకర్ర అర చెంచా, నూనె తగినంత, ఉప్పు తగినంత, నిమ్మరసం చెంచా, ధనియాలు అంచెంచా తాలింపు కోసం: ఆవాలు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, పసుపు పావుచెంచా చొప్పున, కరివేపాకు రెబ్బలు, ఎండుమిర్చి ఒకటి, ఇంగువ పావుచెంచా.



**తయారీ:** ఉసిరికాయల్లో తడిలేకుండా చేసి వాటిల్లోని గింజలని తీసేయాలి. స్టౌపై పాన్ పెట్టి వేడెక్కాక చెంచాన్నర నూనె పోసుకోవాలి. నూనె వేడెక్కాక పచ్చిమిర్చి, ధనియాలు, జీలకర్ర వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్లో మరో చెంచాన్నర వేసుకొని అందులో ఉసిరి ముక్కల్ని తక్కువ మంట మీద ఐదు నిమిషాలు వేయించుకోవాలి. రోటిలో లేదా మిక్సీలో వేయించి పెట్టుకున్న పచ్చి మిర్చి, జీలకర్ర, ధనియాలని కచ్చా పచ్చాగా దంచుకోవాలి. అందులో వేయించిన ఉసిరి ముక్కలు, ఉప్పు కూడా వేసి రుబ్బు కోవాలి. అవన్నీ నలిగాక అప్పుడు కొబ్బరికోరు వేసి మళ్లీ రుబ్బుకోవాలి. పాన్లో ఇంగువ తాలింపు వేసి స్టౌ కట్టేసి, అందులో రుబ్బిన కొబ్బరి మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. ఈ ఉసిరి కొబ్బరిపచ్చడిలో కాస్త నెయ్యి వేసుకుంటే అన్నంలోకి భలే రుచిగా ఉంటుంది.

## ఉసిరి కారం

**కావాల్సినవి:** ఉసిరికాయలు మూడు, ఉల్లిపాయలు ఒకటి(చిన్నది), మూడు వెల్లుల్లి రెబ్బలు, నూనె మూడు చెంచాలు, కారం రెండు చెంచాలు, ఉప్పు తగినంత, **తాలింపు కోసం:** ఆవాలు పావుచెంచా, జీలకర్ర పావుచెంచా. కరివేపాకు ఒక రెబ్బ

**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసుకోవాలి. తర్వాత వాటిని ముక్కలు చేసి గింజలు తీసి ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లితో కలిపి మిక్సీ పట్టుకోవాలి. స్టౌపై పాన్పెట్టి మూడు చెంచాల నూనె పోసి వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి తాలింపు వేసుకోవాలి. ఇందులో రుబ్బి పెట్టుకున్న ఉసిరి ముద్దను వేసుకుని పచ్చివాసన పోయేవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత కారం, ఉప్పు వేసి కాసేపు ఉడకనివ్వాలి. మరి కాసేపటికి నూనె వేరవుతుంది. అప్పుడు దింపేయాలి. ఇది టిఫిన్లోకి, అన్నంలోకి కూడా బాగుంటుంది. ○



# హ్యాపీ క్రిస్మస్

**'యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూరుదిక్కున మేము ఆయన నక్షత్రముచూచి, ఆయననుపూజింప వచ్చితిమని చెప్పిరి' (మత్తయి 2:2), 'వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై యింటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి...కానుకలుగా ఆయనకు సమర్పించిరి' (మత్తయి 2:10,12).**



ఇది డిసెంబరు మాసం.

ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు జరుగుతున్నాయి. 'క్రిస్మస్' అంటే ఆర్భాటంగా పండుగ చేసుకోవడం కాదు కాని, ఆయనను పూజించడమే అసలైన క్రిస్మస్. సర్వమానవాళి పాపంలో, అంధకారంలో జీవిస్తున్నవారిని వెలుగులోని నడిపించి, పాపపు బంధకాలను విడిపించేందుకు యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడు. తల్లి అయిన మరియ పరిశుద్ధాత్మ ద్వారా యేసుక్రీస్తుకు జన్మనిచ్చింది. ఆయన పుట్టుక పరిశుద్ధమైనది. ఆయన జీవించిన విధానం పరిశుద్ధమైనది. చివరికి ఆయన ఏ పాపం చేయకపోయినా, మనందరి దోషాలను తనపై వేసుకుని, పాపిగా మార్చబడి, మనకు బదులుగా సిలువలో ఆయన మరణించాడు. ఈ సత్యాన్ని తెలుసుకుని, ఆయనను తమ సొంతరక్షకుడిగా అంగీకరించిన వారికి ప్రతిరోజు, ప్రతిక్షణం రక్షణ పర్వదినమే.

## కానుకలతో దేవుడిని ఆరాధించారు

తూర్పు దేశపు జ్ఞానులు ప్రభువు జన్మించిన విషయాన్ని ఆకాశంలో ఓ నక్షత్రం మిక్కిలిగా ప్రకాశిస్తుండగా, వారు తమ గ్రంథాలను చదివి, పరిశీలించారు. యూదుల రాజుగా యేసుక్రీస్తు జన్మించాడని, వారు బెత్లెహేంలోనే ప్రభువు జన్మించాడని, ఆయనను ఆరాధించేందుకు వచ్చారు. క్రిస్మస్ అంటే ప్రభువును ఆరాధించడమే. ఎలీసబెతు మరియకు వచ్చి, ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు వచ్చి, ప్రభువు ఇంకా జన్మించకముందే ఆయనను ఆరాధించింది. మరియ కూడా ప్రభువు పుట్టకముందే ఆయనను పూజించింది. గొర్రెల కాపరులు దూత చెప్పిన సమాచారం బట్టి, ఆయనను ఆరాధించేందుకు వచ్చారు. సుమయోను అనే నీతిమంతుడు కూడా ప్రభువును ఆరాధించారు. ఇలా వీరంతా యేసుక్రీస్తు జన్మించాడని ఆర్భాటాలు చేసుకో లేదుకాని, ఆయనన పూజించారు.

## శాంటాక్లాస్

ఈ క్రిస్మస్ సీజన్‌లో ప్రభువు కంటే మనకు శాంటాక్లాస్ ఎక్కువగా కనిపిస్తున్నాడు. షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఇతర సమావేశాలలో కూడా ప్రభువు కనిపించడం లేదు కానీ, శాంటాక్లాస్ కనిపిస్తున్నాడు. ఇది చాలా విచారకరం. ప్రభువు మనందరి కోసం మరణించాడు. శాంటాక్లాస్ ఒక మానవతావాదిగా పేదపిల్లలకు కానుకలను ఇచ్చాడు. ఇతడు ధనవంతుల వద్ద కానుకలను సేకరించి, పేదలకు పంచిపెట్టాడు. ఇతని త్యాగం ఇంతే తప్ప, మరో గొప్పతనం అంటూ ఏమీ లేదు. కాబట్టి మనం యేసుక్రీస్తుపై మాత్రం దృష్టిని కేంద్రీకరించి, ఆయనను ఆరాధించాలి.

## జ్ఞానుల కానుకలు

తూర్పుదేశపు జ్ఞానులు బాలయేసును చూసేందుకు వచ్చినప్పుడు బంగారం, సాంబ్రాణి, బోళమును కానుకలుగా సమర్పించారు. బంగారం అంటే ఆయన రాజరికానికి గుర్తు, సాంబ్రాణి ఆయన త్యాగానికి, బోళము పాలనకు గుర్తు.



ఇప్పుడు ప్రభువు ఈ కానుకలను ఏమీ మన నుంచి కోరడం లేదు కాని, ఆయన మన హృదయాన్ని మాత్రమే కోరుతున్నాడు. మన గుండెలో ఆయనకు చోటు ఇచ్చి, ఆయనను సొంత రక్షకుడిగా అంగీకరించాలని మాత్రమే ప్రభువు కోరుతున్నాడు.

## ఆర్భాటాలు వద్దు

క్రిస్మస్ పండుగ అంటే చర్చిలను ఆర్భాటంగా డెకరేషన్ చేసుకోవడం, ఇంట్లో క్రిస్మస్ ట్రీని పెట్టి, బెలూన్లతో ముస్తాబు చేసుకోవడం తప్పు కాదు. కానీ ఈ ఆర్భాటాల ముసుగులో దేవుడిని ఆరాధించాలి అనే గొప్ప సత్యాన్ని విస్మరించి, సంబరాలలో అపవాదిని ఆరాధిస్తున్నాం. ఇటీవల సెమీక్రిస్మస్, గ్రాండ్ క్రిస్మస్ పేర్లతో జరుగుతున్న క్రిస్మస్ మీటింగులు అల్లరితో కూడిన ఆటపాటలతో కొనసాగ డం విచారకరం. డీజే పాటలతో హోరెత్తి స్తున్నారు. దేవుడు అల్లరికి కర్తకాదు, ఆయన పరిశుద్ధుడు. మన హృదయాన్ని శుద్ధిగా ఉంచుకుని, ఆయనను ఆరాధించాలి.

## పార్టీలకు కొదువ లేదు

క్రిస్మస్ అంటే విచ్చలవిడిగా డబ్బును ఖర్చుపెట్టి, మరీ పార్టీలను చేసుకుంటున్నారు. విపరీతమైన పిండివంటలు, భోజన పదార్థాలతో, ఆటపాటలతో క్రిస్మస్ అర్థాన్నే మార్చివేస్తున్నారు. వేడుకలు జరుపుకోవడం తప్పు కాదు. పిండివంటలు చేసుకోవడం కూడా తప్పు కాదు. కానీ ఈ సంబరాల్లో పూర్తిగా నిమగ్నమైపోయి, అసలైన క్రిస్మస్ అర్థాన్ని మర్చిపోతున్నాం.

## నిజమైన ఆరాధన



గొర్రెల కాపరులు ప్రభువు దూత తమకు ఆజ్ఞాపించి నట్లుగా యేసుక్రీస్తును చూసి, ఆరాధించారు. అంతే కాదు, వారు తమ హృద యంలో దేవుడిని ప్రతిష్ఠిం చుకుని, తమ స్వగ్రామాలకు వెళ్లి, దేవాదిదేవుడిని ఆరాధిస్తూ, సువార్తను ప్రకటించారు. క్రీస్తు మనల్ని రక్షించేం దుకే వచ్చాడు అనే సత్యాన్ని ప్రకటించాల్సిన బాధ్యత మనపై ఉంది. సువార్తను ప్రకటించేవారి పాదాలు సుందరంగా ఉంటాయని, దేవుడి వాక్యం సెలవిస్తున్నది. కాబట్టి మనం ప్రభువును సర్వలోకానికి చాటిచెబుతూ, అనేకులు ఆయన రాజ్యంలో ప్రవేశించేందుకు కృషి చేస్తున్నవారే నిజమైన క్రిస్మస్ ఆనందాన్ని అనుభవించగలరు. మన ఆనందం ఏదైనా విషాదంగా మారకూడదు. మన పండుగలు మనకు ఓ ప్రయోజనకరంగా ఉండాలి.

రానురాను దేవుడిపై భయం అనేది తగ్గిపోతున్నది. ఆర్భాటాలు, సందడిలు, సంబరాలు మితిమీరిపోతున్నాయి. యేసుక్రీస్తు ఏ ఉద్దేశంతో ఈ లోకంలో జన్మించారో, ఆ అర్థాన్నే పూర్తిగా మార్చేలా మన పద్ధతులు, విధానాలు ఉన్నాయి. ఇకనైనా ఆర్భాటాల ముసుగులో యేసుక్రీస్తు జన్మించిన ఉద్దేశాన్ని విస్మరించకుండా జాగ్రత్తపడదాం. అప్పుడే మనకందరికీ నిజమైన హ్యాపీ క్రిస్మస్.

**- వాణిపుష్ప**




రవి: డెబ్బై సంవత్సరాలు దాటిన మీ తాతయ్య ఏం చేస్తున్నాడురా?

రంగా: గవర్నర్ పదవి కోసం ఎదురు చూస్తున్నాడురా!

..........

టీచర్: పిల్లల పుట్టిన రోజుకు పెద్దలను ఎందుకు పిలుస్తారా?

గిరి: ముద్దులు పెడతారని.



..........

టీచర్: భాస్కర్, చదువుకునేటప్పుడు నీకు తెలుగు సరిగ్గా వచ్చేది కాదుగా. ఇప్పుడు ఏం చేస్తున్నావురా?

భాస్కర్: తెలుగు సినిమాలకు పాటలు రాస్తున్నాను టీచర్.

టీచర్:...?

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

తల్లి: చింటూ, ఏం చేస్తున్నావురా?

చింటు: మందుబిళ్లలకి సైడ్‌లు కట్ చేస్తున్నానమ్మా!

తల్లి: ఎందుకురా?

చింటు: సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా వుండటానికి.

తల్లి: ఆ...!?

..........

రాము: నా జన్మ ధన్యమయింది రాధా.

రాధ: ఎందుకు అలా అంటున్నావు?

రాము: నన్ను చూసి కన్ను కొట్టావుగా.


రాధ: నీ మొహం... నీకు అంత సీన్ లేదులే.

రాము: ఎందుకు? నాకేం తక్కువైంది??

రాధ: నా కంట్లో నలక పడింది. ఆ బాధ తట్టుకోలేక కన్ను కొట్టాను.

రాము: ...?!

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ



కథ

# వైవిధ్యం సృష్టి విలాసం

ఒకసారి అడవికి విహారానికి వచ్చిన సుబ్బయ్య కుటుంటానికి ఒక కుందేలు పిల్ల దొరికింది. సుబ్బయ్య భార్య మహాలక్ష్మి , పిల్లలు రాము, శివాలు ముచ్చట పడటంతో ఆ కుందేలు పిల్లను ఊరికి తెచ్చుకొని పెంచటం మొదలు పెట్టారు. అది శాకాహారి కాబట్టి దానిని పెంచటం పెద్ద శ్రమ కాలేదు సుబ్బయ్య కుటుంబానికి. పిల్లలతో అడుకొంటూ కుందేలు కూడా హాయిగా కాలం గడుపుతున్నది. కుందేలుకు చిన్ని అని పేరుపెట్టారు. చిన్నీ అని పిల్లా పెద్దా ఎవరు పిలిచినా చెంగు చెంగున ఎగురుకొంటూ వచ్చేది కుందేలు.



అయితే చిన్ని చాల బుద్ధి కలది. ఆ ఇంటిలో అన్నీ గమనిస్తున్నది. ఇలా గమనిస్తుండగా దానికొక సందేహం వచ్చింది. అదేమిటంటే అడవిలో కూడా ఆడ, మగా జంతువులు ప్రతి జాతిలో ఉంటాయి. పిల్లల్ని కంటాయి. కొన్ని రోజుల తర్వాత ఎవరి జీవితం వారిది. పిల్లల దారి పిల్లలది. కానీ, సుబ్బయ్య గారింట్లో సుబ్బయ్య, ఆయన భార్య అనుక్షణం కీచులాడుకొంటుంటారు. ఒకరిమీద మరొకరు అజమాయిషీ చేయాలనుకొంటుంటారు. ఎక్కువసార్లు సుబ్బయ్యనే మహాలక్ష్మి ్మని తన మాట వినేట్లు చేస్తాడు. మళ్ళీ కాసేపటికి ఇద్దరూ కలిసి నవ్వుకొంటూ మాట్లాడుకొంటుంటారు. చూడడానికి వీళ్ళ జీవితం మన జీవితంలానే ఉన్నా ఇదేం విచిత్రమబ్బా మనిషి జీవితంలో. ఇలా అనుకొంటూ చిన్న కునుకు తీసింది.

అందులో దానికొక కల వచ్చింది. ఆ కలలో ఒక రుషి కూడా తనలాగే కీచులాడుకొనే మొగుడూ పెళ్ళాన్ని చూసి, భార్యపై జాలిపడి ఆమెను పులిగా, ఆయనను జింకగా మార్చేశాడు. ఎప్పుడైతే ఆ జంటలోని భార్య పులిగా మారిందో వెంటనే భర్త ఆమెను చూసి పరుగు లంఘించుకొన్నాడు. అది చూసి రుషి కంగారు పడ్డాడు. రుషి కోరుకొంది పేరు, జరిగింది వేరు. భర్త భార్యను అనుక్షణం శాసించటం, భార్య లొంగి ఉండటం ఇష్టం లేక తాను వారిని అలా మారిస్తే భార్యకు భయపడి జింక అణిగిమణిగి కాపురం చేస్తుందనుకొన్నాడు. కానీ, తానొకటి తలిస్తే వేరొకటి జరిగింది. వారి కాపురమే బుగ్గిపాలైంది. ఇలా అనుకోని, చేసిన పొరపాటుకు పశ్చాత్తాప పడి తిరిగి జింకగా మారిన భర్తను మనిషిగా, పులిగా మారిన భార్యను స్వ స్వరూపానికి తెచ్చాడు. హమ్మయ్య.. తను చేసిన పొరపాటు సరిదిద్దుకొన్నానని లోపల సంతోషపడ్డాడు. కానీ, ఆ సంతోషం ఎక్కువసేపు నిలువలేదు.

ఇప్పుడు భర్త అంటే అణుకువుగా కనిపించే భార్య పూర్వ లక్షణం పోయింది. జింకాకారం నుంచి మనిషైన భర్త ఆమెను క్రితంలాగా చూడ లేకపోయాడు. అలా వాళ్ళ కాపురం ఎవరికి వారిదై, భార్యా భర్తల బంధం తెగిపోయింది.

కునుకు తీస్తున్న చిన్నికి ఓ స్వరం వినిపించింది.. చూశావా చిన్నీ, నువ్వు అనుకున్నట్టే వాళ్ళ జీవితం జంతువుల జీవితంగా మారిపోయింది. అప్పుడు దేవుడు మనుషులను సృష్టించటం దేనికి? అందుకే మనుషుల జీవితం జంతువుల కంటే భిన్నంగా ఉండాలని దేవుడు ఇలా సృష్టి జరిపాడు. వైవిధ్యం సృష్టికి ఆధారం, మకుటం, అందం కూడా. కుందేలుకు మెలుకువ వచ్చింది. తన ఆలోచనలోని లోపానికి సిగ్గు పడింది.

- డా॥ కొప్పరపు నారాయణ మూర్తి



**వార్త ఆదివారం**

## బాలగేయం

### పిట్టగూడు



అనగనగా ఒక పిట్ట
గూడు తాను కట్టెనంట
గుడ్లు పెట్టె ఆ పిట్ట
పిల్లలనే చేశానంట.

కిచకిచమనె పిల్లలంట
మాట ముచ్చటలంట
తల్లిపిట్ట మెచ్చునంట
ఆహారం పెట్టునంట.

ముద్దు ముద్దు పలుకులు
లేత లేత రెక్కలు
బుల్లిపిట్ట ఆటలు
తల్లిబిడ్డ మాటలు

రెక్కలొచ్చి బుల్లిపిట్టలు
ఎగురుటమే నేర్చెనంట
టాటాలు చెప్పినంట
గూడుకై పోయెనంట.

**–పెందోట వెంకటేశ్వర్లు**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- పి.హైమావతి,** విజయనగరం

**ప్రశ్న: రంగులను ఎలా గుర్తిస్తారు?**

**జవాబు:** హైమావతీ మల్లెపూలు తెల్లగా ఎందుకుంటాయి? మల్లెపూవు అన్ని రంగుల తరంగ దైర్ఘ్యాన్ని తనలో కలిపేసుకుంటుంది కాబట్టి. దాని మీద పడిన కాంతి పరావర్తనం చెంది తెల్లగా ఉన్నట్లు కనపడుతుంది. మరి, మల్లెపూవు తెల్లగా వున్న విషయం మనకు ఎలా తెలుస్తుంది? మన కళ్లు మన మెదడుకు చెబితే అప్పుడు మనకు తెలుస్తుంది. అయితే ఈ విషయం చెప్పుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు.

మెదడులో జరిగే ఈ ప్రక్రియతో పాటుగా రంగులను గుర్తించడం మీద సంస్కృతి, భాష కూడా ప్రభావం చూపుతాయని శాస్త్రవేత్తలు 2003లో కనుగొన్నారు. పపువా న్యూ గినియాలోని బెర్నిమో అనే ఆదిమ తెగకు చెందిన ప్రజల మీద పరిశోధనలు చేస్తుండగా ఈ విషయం బయట పడింది. వీరికి నీలం రంగుకు పచ్చ రంగుకు మధ్య తేడా తెలియదు. అయితే పచ్చ రంగులో రెండు రకాల ఛాయలను వీరు గుర్తించగలుగుతారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజల మీద కూడా ఇటువంటి ప్రయోగాన్ని చేశారు. వీరు ఈ రంగులను గుర్తించటం పెరిగింది.

**- సి.దేవసేన,** గుడివాడ

**ప్రశ్న: చీకటిలో మెరిసే స్టిక్కర్స్‌ను ఏ విధంగా తయారు చేస్తారు?**

**జవాబు:** దేవసేనా, రేడియం మూలకంతో మెరిసే స్టిక్కర్లను తయారు చేస్తారు. ఈ రేడియం పిచ్ బ్లెండ్ అనే పదార్థం నుంచి రూపొందుతుంది. అధిక ఎలక్ట్రాన్‌ల కేంద్రక చర్యల కారణంగా రేడియం కాంతి రూపంలో ఎల్లవేళలా కొంత మేర శక్తిని విడుదల చేస్తుంటుంది. ఎలక్ట్రో టైపింగ్ ప్రక్రియ ద్వారా రేడియం స్టిక్కర్లు ప్రింట్ అవుతాయి. ఈ ప్రింటెడ్ స్టిక్కర్లు మాత్రం రేడియం మాదిరిగా ఎప్పుడూ మెరుస్తుండవు. వాటి మీద కాంతి కిరణాలు ప్రసరించినప్పుడే మెరుస్తాయి.



**పింగాణి ఏ ఆమ్లంతోను, క్షారంతోనూ చర్య జరుపదు. లవణాల వలన పాడవదు. పింగాణీ పాత్రలలో నిల్వ ఉంచిన పదార్థాలు ఎక్కువ కాలం చెడిపోకుండా ఉంటాయి. అంతేగాక ఆ పాత్ర కూడా లోపలి పదార్థం వలన ఏవిధంగానూ పాడవదు. ఖాళీ అయిన జాడీని శుభ్రంగా కడిగి అరబెట్టి మరో పదార్థాన్ని అందులో నిల్వ చేయవచ్చు.**

ఇలాంటి మంచి లక్షణాలతో పాటు అలాంటి లక్షణాలే కలిగిన గాజు పాత్రలతో పోలిస్తే చాలా చౌకగా, సులువుగా దొరకడం, వాడకం సులభంగా ఉండడం వలన అవి మనవారికి ఊరగాయల నిల్వకు అత్యంత ప్రియమైన ఎంపిక అయింది. పింగాణి పాత్రలు అందంతో పాటు ఆకర్షణీయంగా ఉంటాయి. వీటిని కొనేముందు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచిది.

ఈ

# బహుళ ప్రయోజనకారి పింగాణి

పింగాణీ అనే పదార్థం భారతీయులకు బహుళ చైనీయుల నుండి తరువాత పర్షియా వారినుండి పరిచయమైనా అది రాజుల, ధనికుల ఇళ్లల్లో విందుల కోసం వాడేదిగానే ఉండిదికానీ సామాన్యులకు చేరువయింది మాత్రం 20వ శతాబ్దం మొదట్లోనే. భారతదేశంలోనే మొట్టమొదటి కార్పొరేట్ కంపెనీ అయిన పారి కో వారు మన దేశంలో మొదటిసారిగా పింగాణీ పాత్రలను తయారు చేసారు. 1789వ సంవత్సరం చెన్నై నగరంలో థామస్ పారీ అనే ఇరవై సంవత్సరాల యువకుడు "పారీ కంపెనీ" ని స్థాపించాడు. ఆ కంపెనీ అదే పేరుతో ఇప్పటికీ ఉంది. ఇది ప్రపంచంలోని అత్యంత పురాతనమైన, సజీవమైన కంపెనీలలో ఒకటి. ఈ సంస్థ రకరకాల వ్యాపారాలు చేస్తూ 1905వ సంవత్సరం ఒక రసాయనిక ఎరువుల కంపెనీని తమిళనాడులోని రాణీపేటలో స్థాపించింది. ఈ ఎరువుల తయారికి గంధకీకామ్లం అవసరం. దాన్ని పెద్ద మొత్తంలో నిలువ చేయడానికి ఆ రోజులలో పింగాణీ జాడీలను వాడేవారు.

అప్పట్లో మన దేశంలో పింగాణీ జాడీలు ఎక్కడా తయారు చేసేవారు కాదు. వాటిని ఇంగ్లాండు నుండి దిగుమతి చేసుకోవలసి వచ్చేది. అది చాలా ఖర్చుతో కూడుకొన్నది. సమయం తీసుకొనేది కావడంతో తామే ఒక కంపెనీని పెడితే పోలా అని అనుకొన్నారు. అలా 1907వ సంవత్సరం రాణిపేట పట్టణంలోనే "పారీ సిరామిక్స్" అన్న కంపెనీ ఏర్పడింది.

పింగాణీ తయారు చేయటానికి ముఖ్యమైన ముడి పదార్థం మట్టి. నీరు, వాయువుల చర్య ద్వారా ఈ మట్టి ప్రకృతి సిద్ధంగా తయారవుతుంది. గ్రైవేటు రాయిలో ఈ మట్టి ఎక్కువ లభిస్తుంది. ఇందులో క్వార్జ్, మైకా, పిల్స్పర్ ఉంటాయి. ఈ మట్టిని మెత్తగా పొడి చేసి, తరువాత దీనికి నీటిని కలపటం ద్వారా మట్టి సాగుతుంది. ఆకృతి మలచటానికి అనువుగా తయారవుతుంది. కావలసిన రూపంకోసం అనేక పద్ధతులను ఉపయోగిస్తారు. ఆకృతిని ఎండబెడతారు. తరువాత వేడి చేయటం కోసం కాల్చుతారు. దీనిని ప్రత్యేకమైన పర్నేసులలో చేస్తారు. వీటిని బట్టీలు అంటారు.

పింగాణిని ఇంగ్లీషులో సిరామిక్ అంటారు. ఇది గ్రీకు భాషా పదమైన కెరమోస్ నుండి ఏర్పడింది. ఫ్లింట్, సెల్ స్పర్ లేక చైనా స్టోన్ను కలిపి పింగాణీని తయారు చేస్తారు. మెరుపు కోసం, క్వార్జ్, ఎల్స్పార్, కొంచెం బోరాక్స్, కొద్ది పరిమాణం లో లెడ్ ఆక్సైడ్ మిశ్రమాన్ని విసిరి జల్లించి సన్నని పొడిగా మారుస్తారు. ఈ పొడికి తగినంత నీరు కలిపి పలచని లేపనము తయారు చేస్తారు. ఎండిన మట్టి పాత్రలను ఈ పల్చని లేపనంలో ముంచి బయటకు తీసి అధిక ఉష్ణోగ్రత దగ్గర వేడి చేస్తారు. ఇలా తయారైన

## ఆనంద 'మైత్రేయ'మ్

పాత్రలు మెరుపును కలిగి ఉంటాయి.

వాస్తవానికి సిలికాన్, కర్బనం, ఆక్సిజను, నత్రజనులు ఇతర పదార్థాలతో సంయోగం చెందగా ఏర్పడే పదార్థాలను సిరామిక్ అంటారు. దీనిని తయారు చేయటానికి ముఖ్యమైన ముడి పదార్థం మట్టి, నీరు, వాయువుల చర్య ద్వారా బండరాళ్ళు కతి కావటం వల్ల



ఈ మట్టి ప్రకృతిసిద్ధంగా తయారవుతుంది. సిరామికలను 650 డిగ్రీల సెంటిగ్రేడు నుండి 1650 డిగ్రీల సెంటిగ్రేడు వరకు అవసరాన్ని బట్టి వేడిచేస్తారు. ఇలా చేయటం వల్ల వస్తువు ఆకృతి శాశ్వతంగా నిలబడుతుంది. దీనివల్ల వస్తువు దృఢంగా తయారై ఎక్కువ కాలం మన్నుతుంది.

సిరామిక్స్ తో అనేక వందల రకాల పనిముట్లు, అలంకరణ సామగ్రి, గృహోపకరణాలు తయారవుతాయి.

క్లే, షెల్‌లను, భవన నిర్మాణాలలో, ఇటుకలు, డ్రైనేజీ పైపులు తయారు చెయ్యటానికి వాడతారు. ప్లాస్టర్ తయారు చెయ్యటానికి జిప్సమ్ వాడతారు. స్పార్క్ ప్లగ్ లు, విద్యుత్ బంధకపు పింగాణీ వస్తువులు, కప్పులు, వంటింటి సామాగ్రి, పింగాణీ కుండలు, మెరుపుగల గోడపెంకులు మొదలైనవి మృత్తికా పాత్రలకు నిలువుటద్దాలు, పోర్సిలైన్‌తో, స్నానాల తొట్టెలు, సింకులు, మరుగుదొడ్లలోని రాళ్ళు, పరికరాలు, ప్లేట్లు మొదలైన వస్తువులను తయారు చేస్తారు. క్లే, పెల్స్పర్, క్వార్ట్జ్‌లతో పోర్సిలైన్ను తయారు చేస్తారు.

**తినే పాత్రల రంగు రూపం మెటీరియల్ రుచిని మార్చేస్తాయంటున్నారు మానసిక శాస్త్రవేత్తలు. క్రాకరీ, కట్లెరీ, సంగీతం ఇవి మూడు ఆహారాన్ని ఎంజాయ్ చేయడాన్ని రెండింతలు పెంచుతాయని వారు గుర్తించారు. అలాగే తినే ప్లేట్ లేదా బౌల్ రంగు, స్వాప్ బరువు కూడా రుచిని ప్రభావితం చేస్తాయంటున్నారు. సాల్టెడ్ పాప్ కార్న్ ను ఎర్రని బౌల్ లో కంటే బ్లూ బౌల్‌లో తిన్నప్పుడు రుచి ఎక్కువగా ఉన్నట్లు ఫీలయ్యారని అధ్యయనంలో పాల్గొన్న వారు చెపుతున్నారు. రంగుల కాంట్రాస్ట్, అలవాట్లు ఇష్టాలు కూడా కీలకంగా ఉంటాయి. అలాగే కొంచెం బరువు గల క్రాకరీలు, కట్లెరీలు ఆహారం మరింత టెమ్టింగ్ గా ఉంటుందట. రంగు రంగుల పింగాణీ పాత్రలు టేబుల్ పై వుంటే అందంగా అతిధులను ఆహ్వానించేలా వుంటాయి. అంటే ఆహారాన్ని చక్కగా వండటమే కాదు.. డెకరేట్ చేయటం, తినే పాత్రల ప్రభావం వల్ల కూడా బాగా తినగలమని అధ్యయనాలు చెప్తున్నాయి.**

టెలివిజను సెట్లలోనూ ఇన్స్ "లేటరుగా ఉపయోగిస్తారు. కొన్ని రకాల కెపాసిటర్లను బేరియం టైటనేటుతో నిర్మిస్తారు.

సిరామిక్ వస్తువులపై నునుపైన పదార్థాలను పొరగా కోటింగ్ చేస్తారు. దీనిని గ్లేజ్ అంటారు. వస్తువుల ఉపరి తలం నునుపుగా మెరుస్తూ ఉంటుంది. దీనివల్ల ద్రవ పదార్థాలను మట్టి పీల్చదు, నునుపుగా ఉండటంవల్ల



శుభ్రం చెయ్యటం తేలిక. రంగుల గ్లేజులతో బొమ్మలు, లతలు, పువ్వులను కూడా వేస్తారు.

సిరామిక్ ఉత్పత్తులలో ముఖ్యమయినవి రిఫ్రాక్టరీలు, పర్నేసులలో పై పొరగా వీటిని వాడతారు. ఉష్ణానికి, రసాయనిక చర్యలకు ఇవి బాగా తట్టుకోగలవు. కొన్ని రకాల రిఫ్రాక్టరీలను రాకెట్ ముక్కు బాగాలను తయారు చేయటానికి ఉపయోగిస్తారు. అత్యంత వేగంగా ప్రయాణిస్తున్నపుడు జనించే అధిక వేడికి ఇవి ఎదురు నిలవగలవు. అల్యూమినా, సిలికా, మెగ్నీషియమ్‌లను రిఫ్రాక్టరీలుగా ఉపయోగిస్తారు. యురేనియమ్ ఆక్సైడ్ సిరామిక్‌లను న్యూక్లియర్ రియాక్టరులో ఇంధన పదార్థంగా వాడతారు. రూబీ రూపంలో అల్యూమినాను తీక్షణమైన లేసర్ కిరణలను ఉత్పత్తి చేయటానికి ఉపయోగిస్తారు.

ప్లాస్టిక్ కంటెయినర్ల కంటే మెలనిన్ పాత్రలు ఎక్కువ మంచివి అనే భావంతో అవే ఎక్కువగా వాడుతుంటారు. పైగా అందమైన మెలనిన్ మోడల్ సెర్వింగ్ బౌల్స్, డిన్నర్ సెట్‌లు, సర్వింగ్ బౌల్స్ ఎన్నో మార్కెట్‌లో కన్పిస్తున్నాయి. అయితే ప్లాస్టిక్ కంటే ఈ మెలనిన్ పాత్రల్లోనే రసాయన స్థాయిలు ఎక్కువగా ఉంటాయింటున్నారు ఎక్స్ పర్ట్స్. పిల్లలకు గర్భిణిలకు ఈ పాత్రల్లో భోజనం పెట్టడం అస్సలు మంచిది కాదంటున్నారు. వీటిలో ఎసిడిక్ లేదా వేడి పదార్థాలు సర్వ్ చేయకూడదు. మెలనిన్ కంటైనర్లు మైక్రోవేవ్‌లో అసలు వేడి చేయకూడదు. యాసిడ్ వాటర్ రెండు కలిసి మరించి మెలనిన్ పదార్థాలలోకి చేరిపోతుందని, ఎక్కువ రసాయినం కలుస్తుందని హెచ్చరిస్తున్నారు. అసలీ ప్లాస్టిక్, మేలనిన్‌ల కంటే శుభ్రమైన గాజు, పింగాణి పాత్రలు వాడటం మంచిదని సలహా ఇస్తున్నారు. గాజు సిరామిక్ పాత్రలు వేడిని తట్టుకునేందుకు, వీలుగా ఉంటాయి:

మొక్కలకోసం ప్రత్యేకమైన డిజైన్స్ తో పింగాణీ కుండీలను తయారు చేస్తున్నారు. వీటిలో పెంచే మొక్కలు ఇంట్లో కూడా అమర్చుకోవచ్చు.

ఇంటిని అందంగా తీర్చిదిద్దుకోవడానికి పింగాణి పాత్రలను కొనేముందు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచిది. పింగాణి పాత్రలు వంటి బ్లూపాటరీతో తయారయ్యే వస్తువులను అధికంగా అచ్చులు ఉపయోగించి తయారు చేస్తుంటారు.

ఇంట్లో ఎన్ని సామానులన్నా గాజు, పంగాణ సామానుల అందం దేనికీ రాదు కాఫీ, టీలు తాగే కప్పుల నుంచి భోజనం చేసే ప్లేట్ల వరకు సరిగా శుభ్రం చేయకపోతే మాత్రం పాతవాటిలా అనిపిస్తాయి.

## ఇలా చేస్తే మెరుస్తాయి..

టబ్‌లో చెంచా వెనిగర్, కొద్దిగా డిష్‌వాష్ ద్రావణం వేయాలి. ఇందులో పావు చెక్క నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీటిలో శుభ్రం చేయాల్సిన గాజు సామాను పావుగంటసేపు నానబెట్టి, ఆ తరువాత స్క్రబ్‌తో రుద్ది మంచినీటితో కడగాలి. చెంచా వంట సోడాలో పావు చెంచా సింథటిక్ వెనిగర్ కలిపి, అర చెంచా డిష్‌వాష్ సోప్ కూడా వేయాలి. ఈ మిశ్రమంలో పాత టూత్‌పుల్ల ముంచి క్రిస్టల్ వస్తువులపై రుద్దితే మురికి పోతుంది.

సెరామిక్ పాత్రలలో ఏదైనా వంటకం వ్యర్థాలు అతుక్కుపోయి ఉంటే వాటిలో కాస్తంత వంటసోడా కలిపిన గోరు వెచ్చని నీటిని పోసి పావుగంట సేపు నాననివ్వాలి. ఆ తరువాత డిష్‌వాష్ బ్రష్‌తో మృదువుగా రుద్దుతూ నీటితో శుభ్రపరిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి.



కథ

# ఆచార్య దేవోభవ

తాళ్ళూరి లక్ష్మి

బాలభానుడు అప్పుడప్పుడే చిరు చీకట్లను పారదోలడానికి తయారవుతున్నాడు. పక్షుల కిలకిలారావాలు, పొలాలకు వెళ్తున్న పశువుల మువ్వల చప్పుళ్ళ తప్ప అంతా నిశ్శబ్దమయం. ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో అప్పుడప్పుడు వీస్తున్న చల్లటి పిల్ల తెమ్మెరలు చక్కటి పైరు వాసనలను సుమధురంగా అందజేసి పోతున్నాయి. ఇంటి ముందట రంగవల్లులు వేస్తున్న సీతమ్మగారు అల్లంత దూరంలో నడిచి వస్తున్న సూర్యం మాస్టారిని చూసి "ఏమండోయ్! మాస్టారు వస్తున్నారు" అంటూ ఇంటిలోపలికి కేకేసింది.

"వచ్చే వచ్చే" అంటూ ఇంటి లోపలి నుండి రాఘవరావు మాస్టారు వచ్చి అప్పటికే అక్కడికి చేరుకున్న సూర్యం మాస్టారిని కలిసి ముందుకు సాగారు.

గత పాతికేళ్ళుగా నిరాటంకంగా కొనసాగుతున్న నిత్య కార్యక్రమమిది. సూర్యం మాస్టారు, రాఘవరావు మాస్టారు ఆ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో లెక్కలు, సైన్స్ ఉపాధ్యాయులుగా ముప్పై యేళ్ల పని చేసి రిటైరయ్యారు పదేళ్ల క్రితం. ఉద్యోగాలు చేస్తున్న కాలం నుండే ఇలా పొద్దుటే ఇద్దరు కలిసి ఊరికి కొంచెం దూరంగా ఉండే పొలాలదాకా ఒక గంటసేపు నడుస్తూ వాహ్యాళికి వెళ్లి రావడం అలవాటు చేసుకున్నారు.

నడకనే వ్యాయామంగా చేసుకున్న ఆ ఉపాధ్యాయులిరువురు ఆ గంటసేపు నడకతో పాటు లోకాభిరామాయణం, స్కూలు ముచ్చట్లు, పరస్పర కుటుంబ విశేషాలు ఒకరితో ఒకరు పంచుకుని ఆనందించేవారు. ఇద్దరికీ ఏమాత్రం సంకోచం లేకుండా ఒకరినొకరు విమర్శించుకునేటంతటి చనువు, కష్టసుఖాలు పంచుకునే దగ్గరితనం కూడా ఉన్నాయి.

సూర్యంగారితో కలిసి కొద్ది దూరం నడిచాక రాఘవరావు అడిగారు "విశేషాలేమిటిరా సూర్యం?" అని.

దానికి సూర్యంగారు "కొత్తగా విశేషాలేమీ లేవురా రాఘవా!" అని బదులిచ్చారు. మరికొద్ది దూరం నడిచాక అన్నారు "ఈ విషయం తెలుసురా రాఘవా!" ఈ సంవత్సరం కెమిస్ట్రీ నోబెల్ బహుమతి ముగ్గురికి కలిపి ఇచ్చారట. అందులో ఒక ప్రవాస భారతీయుడు కూడా ఉన్నాడట. బహుమతి ప్రదానం వచ్చే నెలలో ఉంటుందట. అదైపోగానే మన భారతీయ ప్రభుత్వం కూడా అతనిని భారతదేశానికి పిలిచి సన్మానిస్తుందట".



ఆ మాటలకు రాఘవరావుగారు "చాలా మంచి వార్త చెప్పావురా సూర్యం. ఎట్టకేలకు మన భారతీయులు కూడా అంతర్జాతీయంగా బాగా రాణిస్తున్నారు. ఇలాగే మన భారతీయులు మరెన్నో బహుమతులు సంపాదించుకోవాలిరా" అన్నారు.

ఆ మిత్రులిద్దరూ అలాగే ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ తమ నడక సాగించారు.

............

మర్నాడు నడక సాగిస్తున్నప్పుడు సూర్యంగారు అన్నారు "ఇది తెలుసా రాఘవా? నోబెల్ బహుమతి వచ్చిన ఆ భారతీయుడు మన తెలుగు వాడేనట. మన దేశానికి వచ్చినప్పుడు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా అతనిని సన్మానిద్దామని అనుకుంటోందట".

"అతని పేరేమిటన్నావు?" అడిగాడు రాఘవరావు గారు.

"ఆదిత్య వర్మట. డిగ్రీ వరకు మన రాష్ట్రంలోనే చదువుకుని, బెంగళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎమ్మెస్సీ చేసి, ఆ పైన చదువులన్నీ అమెరికాలో చేసి అక్కడే స్థిరపడ్డాడట ఒక ప్రసిద్ధ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ. ఇప్పుడు వచ్చిన నోబెల్ బహుమతి కూడా సహచరులతో కలిసి రసాయన శాస్త్రంలో అతను సాధించిన నూతనావిష్కరణ కోసమట".

"చాలా ఆనందంగా ఉందిరా సూర్యం. ఒక తెలుగువాడికి ఇంత గుర్తింపు రావడం మనందరికీ ఎంతో గర్వకారణమైన విషయం" ఎంతో సంతృప్తిగా అన్నారు రాఘవరావు గారు.

............

కాలగమనంలో మూడు నెలలు ఇట్టే తిరిగిపోయాయి. ఆరోజే ఆదిత్యవర్మని భారత ప్రభుత్వం సన్మానించింది. మర్నాడు రాష్ట్ర ప్రభుత్వం అతన్ని సన్మానించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది.

ఆ రోజు ఉదయపు వాహ్యాళిలో సూర్యం మాస్టారు చెప్పారు "రాఘవా! నిన్న మన స్కూలు హెడ్ మాస్టారు వెంకటేశ్వర్లు గారు కనబడ్డారు.

మాటల్లో ఆయన చెప్పినదేమిటంటే ఆదిత్యవర్మ మన ఊరు వాడేనట. మన స్కూల్లోనే చదువుకున్నాడట. రేపు రాష్ట్ర ప్రభుత్వ సన్మానం అయిపోయాక మన ఊరికి, ముఖ్యంగా మన స్కూలుకి రావాలని ఉందని తన మనసులోని మాట వ్యక్తపరిచాడట. అందుకోసం ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోందట. ఏర్పాట్లు పూర్తవగానే అతని రాక గురించి అన్ని వివరాలు తెలియజేస్తామన్నారు".

మర్నాటి పొద్దుట నడక మధ్యలో చెప్పారు సూర్యం మాస్టారు "మంచి శుభవార్తరా రాఘవా. ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ సన్మానం అయిపోయాక ఈ రాత్రికి రాష్ట్ర రాజధానిలోనే ఉండి, రేపు పొద్దుటే మన ఊరికి హెలికాప్టర్‌లో వస్తున్నాడట ఆదిత్యవర్మ. పొద్దున పది గంటలకు టౌన్ హాల్లో పౌర సన్మానం చేస్తారట. ఆ తరువాత మన స్కూల్ చూసి సాయంత్రానికి తిరిగి వెళ్లిపోతాడట.

వెంకటేశ్వర్లు గారు మరీ మరీ చెప్పారు.. పదవీ విరమణ చేసిన మనందరినీ తప్పకుండా టౌన్ హాల్‌కి రమ్మని. టౌన్ హాల్ నుంచి మనల్ని స్కూల్‌కి తీసుకు వెళ్లేందుకు ఏర్పాట్లు ఆయనే చేస్తానని చెప్పారు".

...........

ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ఆ రోజే ఆదిత్య వర్మకి ఊరి టౌన్ హాల్‌లో పౌర సన్మానం. సూర్యం మాస్టారు, రాఘవ మాస్టారు పొద్దుటే తయారై తొమ్మిదిన్నరకల్లా టౌన్ హాల్‌కి చేరుకున్నారు. అప్పటికే హాలంతా జనంతో కిక్కిరిసిపోయింది. హాల్లో వెనకగా ఒక మూల రెండు ఖాళీ కుర్చీలు కనబడితే వాటిలో ఆసీనులయ్యారు ఇద్దరూ.

సరిగ్గా పది గంటలకు వేద పండితుల ఆశీర్వచనాలు, మంగళ వాయిద్యాల మధ్య జిల్లా కలెక్టరుగారు, ఎమ్మెల్యేగారు, మున్సిపల్ ఛైర్మన్‌గారు ఆహ్వానిస్తుండగా వేదిక మీదకు వచ్చి ఆసీనుడయ్యాడు నోబెల్ బహుమతి గ్రహీత ఆదిత్య వర్మ.

ముఖ్య అతిథికి పుష్పగుచ్ఛం సమర్పణ అనంతరం కలెక్టర్‌గారు, ఎమ్మెల్యేగారు, మున్సిపల్ ఛైర్మన్‌గారు, మరెందరో పుర ప్రముఖులు ఆదిత్యవర్మ గురించి, అతని గొప్పతనం గురించి వేనోళ్ల ప్రశంసలు కురిపించారు. రసాయన శాస్త్రంలో అతను సాధించిన ఆవిష్కరణల వలన, విజయాల వలన దేశానికొచ్చిన కీర్తి గురించి పదే పదే పొగిడారు.

కలెక్టర్‌గారు పౌర సన్మానానికి గుర్తుగా ఒక మెమెంటోని ఆదిత్యవర్మకి అందజేశారు. చివరగా నోబెల్ బహుమతి గ్రహీత ఆదిత్య వర్మని తన స్పందనని తెలియజేయమని కోరారు.

తన స్పందనని తెలపడానికి ఆదిత్యవర్మ లేచి నుంచుని మైకు అందుకుని స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడడం ప్రారంభించాడు.

"సభకు నమస్కారం. వేదిక మీద ఆసీనులైన పెద్దలకు, ఈ సభకు ఇంత పెద్ద సంఖ్యలో విచ్చేసిన మీ అందరికీ నా మనఃపూర్వక ధన్యవాదాలు. నా స్పందనను తెలియజేసే ముందు ఒక చిన్న కార్యక్రమం పూర్తి చేయవలసి ఉంది. అందుకు మీ అనుమతి లభిస్తుందని భావిస్తూ మన స్కూల్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు గారిని కోరుతున్నాను".

అతని మాటలకు వేదికమీదే ఒక పక్కగా కూర్చుని ఉన్న వెంకటేశ్వర్లుగారు తన అనుచరులను పురమాయించి మరో అయిదు కుర్చీలను వేదిక ముందు భాగంలో వేయించారు. ఆదిత్య వర్మ తిరిగి మాట్లాడడం ప్రారంభించాడు.

"ఈరోజు నేను ఇంత ఖ్యాతి సంపాదించుకోగలిగినంటే అందుకు ప్రధాన కారకులు చిన్ననాటే మన పాఠశాలలో నన్ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు. మట్టిలోని మాణిక్యానికి సాన పట్టినట్టు, బండరాయిని ఒక గొప్ప శిల్పంగా చెక్కినట్టు వారు నా మేధస్సుకు పదునుపెట్టి నేనింతగా ఎదగడానికి దోహదమయ్యారు. వారికేమిచ్చి నా రుణం తీర్చుకోగలను? ఏమి చేసి నా కృతజ్ఞతలు తెలుపుకోగలను? ఈ రోజు నాకు ఈ సన్మానం జరుగుతుంటే ఏమీ తెలియని సామాన్యుల్లా ఏదో ఒక మూల కూర్చుండి తమకే సన్మానం జరుగుతున్నట్టుగా ఆనందించే మహానుభావులు వాళ్లు. వారికి నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఆ మహానుభావుల్ని ఈ వేదిక మీదకు ఆహ్వానించి వారికి ఉడతా భక్తిగా మీ అందరి సమక్షంలో చిన్న సన్మానం చేయడం నా కనీస కర్తవ్యంగా భావిస్తున్నాను.

మొదటగా నాకు సైన్స్‌లో అ ఆలు నేర్పిన సైన్స్ మాస్టారు రాఘవరావు గారిని వేదిక మీదకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. అలాగే లెక్కలు అలవోకగా అర్థమయ్యేటట్లు బోధించిన సూర్యం మాస్టారిని, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో నన్ను నిష్ణాతుడిని చేసిన కేశవశాస్త్రి మాస్టారిని, సీతాపతి రావు మాస్టారిని, సాంఘిక శాస్త్రం కూడా దేనికీ తీసిపోదన్నట్లు బోధించిన సోమయాజులు మాస్టారిని అందరినీ వేదిక మీదకు రావాల్సిందిగా కోరుతున్నాను.

అలాగే ఈ మహానుభావులందరు ఈ కార్యక్రమానికి వచ్చేటట్లు చేసిన ప్రస్తుత హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర్లు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాకు విద్యాదానం చేసిన ఈ గురువులందరినీ మంగళ వాద్యాల మధ్య వేదిక మీదకు తీసుకురావలసిందిగా కోరుతున్నాను".

"ఈరోజు నేను ఇంత ఖ్యాతి సంపాదించుకోగలిగానంటే అందుకు ప్రధాన కారకులు చిన్ననాడే మన పాఠశాలలో నన్ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు. మట్టిలోని మాణిక్యానికి సాన పట్టినట్టు, బండరాయిని ఒక గొప్ప శిల్పంగా చెక్కినట్టు వారు నా మేధస్సుకు పదునుపెట్టి నేనింతగా ఎదగడానికి దోహదమయ్యారు.

ఆదిత్యవర్మ కోరుకున్నట్లే ఆ అయిదుగురు గురువులను మంగళ వాద్యాల మధ్యన జిల్లా కలెక్టర్‌గారే స్వయంగా వారిని వేదిక మీదకు తోడ్కొని వచ్చారు. వారిని వేదిక మీద కుర్చీలలో ఆసీనులను చేసి, ఒక వెండి పళ్లెంలో వారి కాళ్లు కడిగి పుష్పాలతో పూజ చేశాడు ఆదిత్య వర్మ. అందరినీ పుష్పమాలాంకృతుల్ని చేసి, అందరి చేతులకు వినయపూర్వకంగా ఒక బంగారు కడియం తొడిగాడు.

ఆనంద బాష్పాలతో మసక బారుతున్న కళ్లతో అతనికి తమ దీవెనలు అందజేశారు పరవశంతో పులకరించిపోతున్న ఆ గురువులు.

తిరిగి మాట్లాడడం ప్రారంభించాడు ఆదిత్య వర్మ "ఇక్కడున్న ఈ అయిదుగురు గురువులే కాక నా జీవితంలో వేర్వేరు స్థాయిల్లో ఇప్పటివరకు నాకు బోధనలు చేసిన గురువులందరికీ నా వందనాలు.

అయితే ఈ అయిదుగురు గురువులకు నా జీవితంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే వీరు నా ప్రథమ గురువులు. నేను అంకుర దశలో ఉన్నప్పుడు నా చేయి పట్టుకుని మార్గ నిర్దేశం చేసిన ఆచార్యులు వీళ్లు. విద్య మీద ఆసక్తి కలిగించగలిగిన దేవుళ్లు వీరు. అటువంటి వీరిని ఈ రోజు పూజించుకోవడంతో నా జన్మ ధన్యమైనట్లు భావిస్తున్నాను.

మరో విషయం.. నా విద్యాభ్యాసంలో మొదటి పదేళ్లు చదివిన మన ఊరి పాఠశాల కూడా నాకు ఒక దేవాలయంతో సమానం. అందుకే నేనొక నిర్ణయం తీసుకున్నాను. నాకు ధన రూపేణా వచ్చిన బహుమతిలో సగం మన పాఠశాల మౌలిక సదుపాయాలు వృద్ధి చేయడానికి వినియోగించదలచాను. మిగతా సగం మూలధనంగా ఏర్పాటు చేసిన దాని మీద వచ్చే ఆదాయంతో మన స్కూల్లో చదివే యోగ్యులయిన విద్యార్థులకు, ఉత్తమ విద్యార్థులకు, ఉత్తమ ఉపాధ్యాయులకు పారితోషికాలు ఏర్పాటు చేయదలచాను. ఆ బాధ్యతను నా అయిదుగురు గురువులకు, మన స్కూల్ హెడ్‌మాస్టర్ గారికి అప్పజెప్పదలచాను వారు అంగీకరిస్తే".

కరతాళ ధ్వనుల మధ్య తన స్పందన ముగించాడు ఆదిత్య వర్మ. నిర్విరామంగా కారుతున్న కళ్లను మరోసారి తుడుచుకున్నారు సూర్యం మాస్టారు, రాఘవరావు మాస్టార్లతో సహా మిగతా ముగ్గురు మాస్టార్లు. ✦



నేటి యువతరం ఆత్మవిశ్వాసంతో అనంత విశ్వమే హద్దుగా ఎన్నో అద్భుతాలు

# జీవిత క(గా)థలు చదువుదాం!

ఫిజిక్స్ అరుణ్‌కుమార్

సృష్టిస్తోంది. కానీ కొన్ని సందర్భాల్లో ఆత్మన్యూనతా భావంతో ఆత్మహత్యలు, హత్యలతో తమ జీవితాలను అశాంతిమయం చేసుకుంటోంది యువతరం.

ఉన్నత విద్యనభ్యసించిన వ్యక్తులు, ప్రతిభావంతులైన విద్యార్థులు సైతం జీవితంలో ఎదురయ్యే వివిధ రకాల, రంగాల శారీరక, మానసిక ఒటమిలను, సమస్యలను తట్టుకోలేక డిప్రెషన్‌కు లోనై నిరాశావాదంలో బ్రతుకుతున్నారు.

ఏదేమైనా నవతరం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన మహానుభావుల జీవితచరిత్రలు చదవడం లేదు, వారి గురించి తెలుసుకోవడం లేదు. విద్యాసంస్థల్లో కూడా మార్కులు, గ్రేడ్ల చాటున వ్యక్తిత్వపు పాఠాలకు సమయం లేదు. చరితను ప్రభావితం చేసిన అసాధారణ వ్యక్తులు కూడా మనలాంటి సాధారణ వ్యక్తులని ఎన్నో పెద్ద పెద్ద సమస్యల అవరోధాల్ని అధిగమించారని, వైఫల్యాల నిశ్శబ్దం చాటున గెలుపు శబ్దమై మిగిలారని తెలుసుకోవాలి.

కొన్ని దశాబ్దాలుగా తన జీవితం వీల్ చైర్‌కే పరిమితమైన ఆధునిక ఐన్ స్టీన్‌గా ఎదిగిన స్టీఫెన్ హాకింగ్ జీవన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం.

ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావచ్చు కానీ మన ప్రయత్నాల ముందు చాలా చిన్నది అంటూ బ్లాక్ హోల్స్‌పై ఆయన పరిశోధనలు నేటి సైన్సుకు సవాళ్లుగా మారాయి. పెద్దగా అసాధారణ నైపుణ్యాలు లేని గాంధీ ముప్పై నాలుగు కోట్ల మంది భారతీయులను ఏక తాటిపై నిలిపి అహింస, సత్యాగ్రహాలతో అసమానతలు, వివక్షతపై ఆయన చేసిన మానవతపు నైతిక పోరాటం విశ్వ విఖ్యాత మేధావులనే కదిలించింది.

ఈ శతాబ్దపు అత్యున్నత వ్యక్తుల్లో ప్రముఖున్ని చేస్తూ, ఆల్బర్ట్ ఐన్ స్టీన్, బరాక్ ఒబామా, మార్టిన్ లూథర్ కింగ్, బెర్నార్డ్ షా, ఆంగ్ సాన్ సూకీ వంటి ఎంతో మంది నోబెల్ విజేతలకే స్ఫూర్తి ప్రదాతగా నిలిచింది.

మహిళవు కాబట్టి ఉన్నత విద్యకు అనర్హురాలివి కావంటూ పరిశోధనలకు అవకాశం ఇవ్వలేమంటూ అవహేళనలను భరించిన మేడం క్యూరీ తన అసాధారణ ప్రయత్నాల పట్టుదల పరంపరలో భౌతిక, రసాయన శాస్త్రాల్లో రెండింటిలో నోబెల్ గెలిచిన ఏకైక వ్యక్తిగా నిలిచింది నేటికీ.

దాదాపు ఇరవై యేడు సంవత్సరాల జైలు జీవితం అనుభవించి ఎ లాంగ్ వాక్ టూ ఫ్రీడం అంటూ తన జీవిత చరిత్రను రచించిన నెల్సన్ మండేలా, బల్బును కనుగొనే ప్రయత్నంలో అపజయాల కెరటాలకు తలొంచని ఎడిసన్.. ఇలా ఎందరో అంబేద్కర్, అబ్దుల్ కలాం, సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, అమితాబ్ బచ్చన్, ఆంగ్‌సాన్ సూకీ, కల్పనా చావ్లా, మదర్ థెరిస్సా వంటి వివిధ



రంగాల ప్రముఖుల జీవిత చరిత్రలు మన జీవితాలకు వెలుగు దివ్వెలై మన జీవితాలకు మార్గదర్శనం చేస్తూనే వుంటాయి.

గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధిగమిస్తూ తన రెక్కల సాయంతో స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే పక్షిలోని ఆశావాదం, మనకు ఆంజనేయస్వామి దండకం కావాలి. కనీసం నెలకు ఓ ఇద్దరి ప్రఖ్యాత వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేద్దాం. వెలుతురు, చీకటి ప్రకృతి సహజమని గుర్తిద్దాం! నేను ఆరంభించాను.


మరి మీరూ మొదలెడతారుగా! ఇక ఆలస్యమెందుకు? ■

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

# కాకతీయులనాటి తెలుగు వెలుగు



**జయసూర్య**

**ప్రాచీనకాలం** నాటి ఆంధ్రదేశంలో అనాదిగా నివసిస్తున్న ద్రావిడ, యక్ష, నాగ ప్రజలు, తెనుగు లేక తెలుగు మాట్లాడేవారు. కాలగతిలో ఉత్తర హిందూస్థానం నుండి ఆంధ్ర ప్రజల వ్యవహార భాషగా 'దేశి' దిగి వచ్చింది. ఒక తెగ ప్రజ సంచరించిన ప్రాంతంలోని నదులకు, కొండలకు సంక్రమించిన ఆ పేరు, కాలానుగతిలో వారు స్థిరపడిన దేశానికి, ఆంధ్రదేశం అనే పేరు వచ్చింది. క్రీ.శ.220 ప్రాంతంలో ప్రస్తుత కర్నాటకలోని బళ్ళారి జిల్లాలోని పల్లవ రాజుల శాసనంలో మొట్టమొదటిసారిగా 'ఆంధ్రపథము' అనే పదప్రయోగం ఉంది.

తెనుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. తమిళ, కన్నడ, తుళు భాషలతో దీనికి సామీప్యం ఉంది. ఒక భాషలోని మూలపదజాలం, నిత్య వ్యవహారంలో అత్యవసరంగా వాడుకొనే క్రియారూపాలు, వాక్య రచనా పద్ధతి, తదితర వ్యాకరణ విశేషాలను బట్టి ఆ భాషాస్వరూపం నిర్ణయించబడుతుంది. నేటికి కూడా తెనుగు భాషలోని మూలపదజాలం అచ్చ తెనుగులోనే ఉంది. అమ్మ, అక్క, చెట్టు, నీరు, పాము, తేలు, గాలి మొదలైనవి ప్రాచీన కాలంనాటి అచ్చమైన మాటలు. తిను, కొట్టు, తిట్టు, నడు, కూర్చో, వెళ్ళు, రా వంటి ధాతువులు కూడా ప్రాచీనమైనవే. ఈ పదాలకు దగ్గర సంబంధం వున్న మాటలే తమిళ, కన్నడ భాషలలో ఉన్నాయి. ఉదాహరణలు–

| **తెలుగు** | **తమిళం** | **కన్నడం** |
|---|---|---|
| తల | తలై | తలె |
| నెల | నిల | నిలా |
| పప్పు | పరుప్పు | పప్పు |

తెలుగు వాక్య నిర్మాణంలో కర్త, కర్మ, క్రియ – వరుసగా ఉంటాయి. ఇతర ద్రావిడ భాషలలోను అంతే. తెనుగు భాషకు – డు ము వు లు మొదలైన విభక్తి ప్రత్యయాలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. తెనుగు భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని భాషా శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. శాతవాహనుల తర్వాత పరిపాలించిన ఇక్ష్వాకుల శాసనాలలో మొట్టమొదటిగా, తెలుగు మాటలు కనబడుతున్నాయి. ప్రజలు మాట్లాడే నాటి తెనుగు భాషలోని మాటలు కొన్ని యథాతథంగా, కొన్ని సంస్కృతీకరించబడి శాసనాలలో ప్రవేశించాయి. ఆనాటి ఆంధ్రప్రజలు తెనుగుభాష మాట్లాడేవారు. ప్రాకృతం శాసనభాషగా, రాజభాషగా ఉండేది. ప్రాచీన శాసనాలలోని గ్రామాల పేర్లు కొన్ని 'ఊరు'తో అంతం అవుతూ ఉండేవి. ప్రాచీన శాసనాలను పరిశీలిస్తే ఎన్నో గ్రామాల పేర్లు, ద్రావిడ భాషాబంధుత్వాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ ప్రాచీన గ్రామ దానాలు శాసనాలలో ఉన్నాయి. కాకతీయుల నాటి తెలుగుభాష ముందు యుగాల నాటి భాష కంటే విశదంగా, ప్రసన్నంగా రూపొందింది. సులభంగా అర్థమవుతుంది. శాతవాహనుల కాలంలో తెలుగు అస్తిత్వం కనబడీ కనబడనట్టుగా ఉండేది. రేనాటి చోళుల కాలంలో మొదటిసారిగా తెలుగులో చిన్న చిన్న శాసనాలు బయలుదేరాయి. కాని భాష జటిలం. తూర్పు చాళుక్యుల ప్రారంభదశలో వెలువడిన శాసనాలు కూడా ప్రాకృత భాషా సంసర్గం ఎక్కువ కావటంతో అర్థం కావటం కష్టం.




కాకతీయులు వచ్చేసరికి తెలుగు భాష కొంత స్వతంత్రత పొందింది. వాక్యరచన సుగమమైంది. ఈ యుగంలో గద్య, పద్యరచన సామాన్యమై సరళంగా సాగింది. కాకతీయ యుగంలో రాజనీతి ప్రతిపాదక గ్రంథాలు కూడా తెలుగులో వెలిశాయి. తెలుగులో శతక ప్రక్రియ ఈ యుగంలోనే ప్రస్ఫుటమైంది. మల్లికార్జున పండితారాధ్యుడు రచించిన శివతత్త్వసారమే తెలుగు శతక వాఙ్మయానికి ఓంకారం. తెలుగులో ద్విపదను చేపట్టిన మహాకవి పాల్కురికి సోమనాథుడు. జానుతెనుగును మతాగ్రహావేశంతో సమర్థించిన కవి పాల్కురికి. విస్తృత సాహిత్య ప్రయోజనం సాధించి ప్రాచీన ఛందం తరువోజను సృష్టించి తదనంతర కవులకు మార్గదర్శకులయ్యారు. కాకతీయుల కాలంలో ప్రభువులు సంస్కృత కవులను ఆదరించినా స్వతంత్ర సామంతులు, మహోద్యోగులు, తెలుగు కవులను చేరదీసి కీర్తి గడించారు. తిక్కన మహాకవి మహాభారతాన్ని, గణపతిదేవుని ఆస్థానంలో పూర్తిచేసి ఆచంద్రతారార్కం తెలుగు సాహిత్యానికి మార్గదర్శకులయ్యారు. క్రీ.శ.1370 నాటి ఏకామ్రనాథుని ప్రతాపరుద్రచరిత్ర తెలుగులో మొట్టమొదటి వచన రచనగా, ప్రథమాంధ్ర చరిత్రకారునిగా ప్రతిష్ఠ తెచ్చింది. సరళమైన గ్రాంథికంలో రాయబడి తెలుగుజాతి చరిత్రలో స్వర్ణాధ్యాయాన్ని సృష్టించిన కాకతీయ చక్రవర్తుల మహోజ్జ్వల చరిత్రను తెలియజెప్పింది. కాకతీయ యుగం నాటి సాంఘిక చరిత్రగా అనేకానేక విషయాలను వెలుగులోకి తెచ్చిన ప్రతాపరుద్ర చరిత్ర గణనీయమైన చారిత్రక ఆధారం.

ద్రావిడ కుటుంబానికి చెందిన 'తెనుగు' అనే మాటకు దక్షిణ దిక్కుగా సంచరించేవారు అని అర్థం వుంది. తెన్– దక్షిణదిక్కు అని తమిళ, కన్నడ భాషలలో అర్థం వుంది. మయన్మార్ ప్రాంతంలోని తైలాంగ్ ప్రజలు ప్రాచీన తెలుగుజాతికి చెందినవారనే చారిత్రక ఆధారాలు ఉన్నాయి. తెనుగు క్రమంగా తెలుగైంది. అందులో నుండే తెలంగాణ పేరు ఆవిర్భవించింది. తెలంగాణ, ఆంధ్రులు దక్షిణాపథానికి రాకముందే, ద్రావిడ కుటుంబానికి చెందిన తెలుగు ప్రజలు నివసిస్తుండే ప్రాచీన తెలంగాణ లోహయుగంనాటి రాక్షసగుళ్ళు వంటి సమాధులు దోర్నకల్లు, బేగంపేట, మౌలాలి, మధిర, చింతకాని ప్రాంతాలలోని కాలగర్భంలోని చరిత్రను బహిర్గతం చేస్తూ నాటి సామాజిక వ్యవస్థ వెలుగులు ప్రసరింపచేసాయి. దక్కను పీఠభూమిలో అంతర్భాగమైన తెలంగాణ అత్యంత ప్రాచీనమై ద్రావిడ నాగరికత విలసిల్లిన చారిత్రక ఆధారాలు ఆంధ్రజాతి తెగలస్థాయి నుండి జాతి స్థాయికి, మతావేశ దశ నుండి తెలుగు భాషా సమైక్యతా దశలో పయనిస్తోందని ప్రముఖ చారిత్రక మేధావి ఏటుకూరి బలరామమూర్తి తన ఆంధ్రుల సంక్షిప్త చరిత్రలో విశదీకరించారు.

# నటన అనివార్యం

యామిజాల జగదీశ్

ఒక గురువు ఓ చెట్టు కింద కూర్చుని ఉన్నారు. ఆయన ఎదుట ఓ శిష్యుడు వచ్చి నిల్చున్నాడు.

"స్వామీ....నాకొక సమస్య...." అన్నాడు అతను.

"అవునా...నీ సమస్య ఏమిటీ? విపులంగా చెప్పు" అన్నారు గురువు.

"స్వామీ...ఈ ఊళ్ళో ఓ గొప్ప ధనవంతుడు ఉన్నాడు. ఆయన ఓ పర్యటనకు వెళ్తున్నాడు. ఆయన తిరిగి రావడానికి పది నెలలు అవుతుంది" అన్నాడు.

"ఆ ధనవంతుడు పర్యటనకు వెళ్తే నీకొచ్చిన సమస్యేంటీ?" అని అడిగారు గురువుగారు.

"ఆ ధనవంతుడికి ఓ కూతురు ఉంది. ఆ అమ్మాయి బాధ్యత నాకు అప్పగించి పర్యటనకు వెళ్లాలనుకుంటున్నారు" అన్నాడు శిష్యుడు.

"అయితే ఏమిటీ? ఆయన కుమార్తెను జాగ్రత్తగా చూసుకో! అంతేగా" అన్నారు గురువు.

అప్పుడు శిష్యుడు చెప్పాడు "స్వామీ, నన్ను ఈ ఊళ్ళో అందరూ నిజాయితీపరుడని, మంచివాడినని చెప్తుంటారు. అందుకు తగినట్టు నేను నా మనసుని నటించక తప్పడం లేదు. వీలైన మేరకు జాగ్రత్తగానే ఉంటున్నాను. అయినప్పటికీ నా మీద నాకింకా నమ్మకం రాలేదు. ఈ స్థితిలో ఆ ధనవంతుడి కుమార్తెను మా ఇంట్లో ఎలా పదిలంగా ఉంచుకోగలను. నాకు భయమేస్తోంది. ఏదైనా జరగరానిది జరిగితే నా పరువేం కావాలి? కనుక ఈ సమస్య నుంచి మీరే నన్ను గట్టెక్కించాలి అన్నాడు" శిష్యుడు.

అతని మాటలన్నీ విన్న గురువు "ఇటువంటి సమస్య నుంచి తప్పించుకునే రహస్యం తెలిసిన వ్యక్తి ఒకడున్నాడు. అతను నాకు తెలుసు. నేను అతని చిరునామా చెప్తాను. తిన్నగా అతని వద్దకు వెళ్ళు. నీకు సాయం చేస్తాడు" అన్నారు గురువు.

గురువు చెప్పిన ఆ వ్యక్తి ఓ పిచ్చివాడు. అతను పొరుగు గ్రామంలో ఉంటాడు.

"స్వామీ, మీరు చెప్పిన ఆ మనిషి గురించి నేనూ విన్నాను. అతను పిచ్చివాడు కదండీ! అతను నాకెలా సాయపడతాడు?" అని అడిగాడు శిష్యుడు.

అయితే గురువు "దాని గురించి నువ్వేమీ ఆలోచించకు. నువ్వు ఆలస్యం చేయకుండా తిన్నగా అతని దగ్గరకు వెళ్ళు" అన్నారు గురువు.

శిష్యుడు సరేనని నేరుగా అతని వద్దకు వెళ్ళాడు. అతను వెళ్ళేసరికి ఆ పిచ్చివాడికి ఓ కుర్రాడు



సీసాలో ఏదో పోసిచ్చాడు. ఆ పిచ్చివాడు దానిని తీసుకుని తాగుతున్నాడు. అది చూడగానే శిష్యుడు కంగారుపడ్డాడు. తల తిరిగింది. అయినప్పటికీ గురువు చెప్పినట్టుగా అతను పిచ్చివాని వద్దకు వెళ్లాడు.

"అయ్యా, దయచేసి చెప్పండి. ఇప్పుడు మీరేం చేస్తున్నారు?" అని అడిగాడు శిష్యుడు.

అప్పుడా మనిషి "ఈ కుర్రాడు నా కొడుకు. దగ్గరకు రా. అతను గ్లాసులో పోసిచ్చింది మద్యం కాదు. అది వొట్టి నీరు, అదే నేను తాగుతున్నాను" అన్నాడు. "సరే. కానీ మీరెందుకు ఏదో మద్యం తాగుతున్నట్టు పోజిస్తున్నారు. మీరు మీ చేతిలో ఉంచుకున్నది మద్యం సీసానే కదా. మరి అందులో నీరు పోసి తాగుతున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు. మీరు ఎందుకిలా చేస్తున్నారు?" అని అడిగాడు శిష్యుడు.

అప్పుడు అతను ఇలా చెప్పాడు...

"ఒకాయన యాత్రకు పోతున్నప్పుడు అతని కుమార్తెను నా రక్షణలో ఉంచాలనుకున్నాడు. అది నాకిష్టం లేదు. అందుకని ఆ వ్యవహారం నుంచి బయట పడటానికి బాగా ఆలోచించి ఇలా తాగుబోతులా నటిస్తున్నాను. అంతేతప్ప నేను అందరూ అనుకునేలా పిచ్చివాడిని కాను. పిచ్చివాడిలా నటించడంతోనే ఆ ధనికుడు తన కూతురుని నాకు అప్పగించలేదు అని నువ్వు కూడా ఈ పద్ధతినే పాటించు. నువ్వూ బయటపడతావు" అన్నాడు పిచ్చివాడిలా నటిస్తున్న వ్యక్తి.

ఈ కథను సరదాగా నలుగురి నోటా నానింది. ఇలా పలు సందర్భాలలో మనమూ ప్రవర్తించే తీరుతో కొన్ని సమస్యల నుంచి బయట పడొచ్చు.

...........

నాకు తెలిసిన ఓ మిత్రుడు ఉన్నాడు. ఆయనకు ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చి పడిపోతుంటాడు. విలవిలా కొట్టుకుంటాడు. వెంటనే అతని భార్య పరుగున వచ్చి తాళం గుత్తి అతని చేతిలో పెడుతుంది. ఆ తర్వాత అతనికి వచ్చిన ఫిట్స్ తగ్గిపోతాయి. అతను మళ్ళీ మామూలు మనిషి అయిపోతాడు.

ఒకరోజు నేను అతనిని కలిసి "ఏమిత్రా, ఫిట్సుకీ తాళం గుత్తికి ఏ మాత్రం సంబంధం లేదని డాక్టర్లు చెప్తున్నారు.. మరి నీకు మాత్రం అది ఎలా తగ్గిపోతోంది? అని అడిగాను.

దానికతను "బలేవాడివే, నేను ఉత్తినే ఫిట్స్ వచ్చినట్టు కిందపడిపోయి కాళ్ళూ చేతులూ ఆడిస్తాను. అప్పుడే ఆమె నుంచి నా చేతికి తాళం గుత్తి వస్తుంది. తాళం గుత్తి కోసం ఈ వేషం వేస్తున్నాను అంతే. మరొకటి కాదు. అంతా నటనే. ఆ నటనతోనే తాళం గుత్తి అందుకుంటున్నా. ఆ సమయంలో తప్ప ఇంకెప్పుడూ ఆమె నుంచి తాళం గుత్తి తీసుకోవడం అసాధ్యం. అందుకే అలా నటిస్తున్నాను. అంతేతప్ప నాకు ఫిట్స్ రావు. నేను బాగానే ఉన్నా. అయితే ఒక్కటి...ఈ రహస్యం నీకూ నాకూ మధ్య ఉండనివ్వు అని భుజం మీద చెయ్యి వేసి నవ్వాడు మిత్రుడు. ✦

# అందాయి



**తెలుగు సాహిత్యకారుల జయంతి-వర్ధంతులు**
ప్రాతఃస్మరణీయులు
రచయిత: చలపాక ప్రకాష్
ప్రచురణ: రమ్యభారతి, విజయవాడ;
ప్రతులకు: చలపాక ప్రకాష్,
ప్రతులకు: 1-4/3-36,
సంజయ్‌గాంధీ కాలనీ, విద్యాధరపురం,
విజయవాడ-520 012. ఆంధ్రప్రదేశ్
......

**పరమార్థం**
ఆధ్యాత్మిక వ్యాసాలు
రచయిత: డా॥ పులివర్తి కృష్ణమూర్తి
ప్రతులకు: డా॥ పులివర్తి కృష్ణమూర్తి
103, విజేత పార్క్ వ్యూ, సలీంనగర్,
మలక్‌పేట, హైదరాబాద్-500 036.
......

**పిల్లల బొమ్మల చిరంజీవి**
బాల సాహిత్యం
రచయిత: టి.శాంతాభాస్కర్
లోకేష్ ప్రచురణలు; ప్రతులకు
2-711/2, షాహుకార్ బంగ్లా వీధి,
కొంగారెడ్డిపల్లి, చిత్తూరు-517 001.
.....

**ఈజిప్ట్ ఆవిర్భావం**
(పరిచయం)
రచయిత: డా॥ యస్.వేణుగోపాల్
ప్రతులకు: డా॥ యస్.వేణుగోపాల్
సుధా ప్రచురణాలయం
11-5-1, జీ-6, ఎమ్ ప్లాజా,
క్రిమినల్ కోర్ట్ రోడ్, బజార్‌ఘాట్,
హైదరాబాద్-500 004
.....

**ఐతరేయ ప్రశ్నోపనిషత్తులు**
(ముత్యాల సరాలతో)
రచయిత: జక్కని వేంకటరాజం
ప్రతులకు: 7-2-109, సుభాష్‌నగర్,
సిరిసిల్ల-505 301
రాజన్న సిరిసిల్ల జిల్లా
.....

**షిరిడీ సాయిబాబా అంటే ఎవరు?**
(వాస్తవాలతో కూడిన వ్యాస సంకలనం)
రచయిత: జస్టిస్ బి.చంద్రకుమార్
ప్రతులకు: జస్టిస్ బి.చంద్రకుమార్
హస్తినాపురం సెంట్రల్,
హైదరాబాద్-500 079.



**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
సెల్: 9885446501/9885449458




# తూర్పు వీధి పోటు అంటే ఏమిటి?

**వీధి పోట్లలో అనేక రకాల వీధి పోట్లు ఉంటాయి. కేవలం మనకి ఎనిమిది దిక్కులు ఉన్నాయి కాబట్టి ఎనిమిది రకాల వీధి పోట్లు మాత్రమే ఉంటాయి అని అనుకోవటానికి వీల్లేదు.**

వీధి పోట్లు అనేక రకాలుగా ఉంటాయి. కొన్ని వీధి పోట్లు మంచి ఫలితాలను ఇస్తాయి. వాటిని "వీధి చూపులు" అంటారు. కొన్ని వీధి పోట్లు చెడు ఫలితాలని ఇస్తాయి. వాటిని "వీధి పోట్లు" అంటారు. మనం రకరకాల వీధి పోట్ల గురించి వీధి చూపుల గురించి తెలుసుకుందాం. ప్రస్తుతం మనం తూర్పు భాగంలో వచ్చే వీధి పోట్ల గురించి తెలుసుకుందాం. తూర్పు దిక్కున వచ్చే భుజంలో ఇటు ఈశాన్య భాగం, అటు ఆగ్నేయ భాగాలను వదలగా మధ్యలో వచ్చేది తూర్పు భాగం. ఈ తూర్పు భాగంలో తగిలేటటువంటి వీధిపోట్లు లేదా వీధి చూపులను తూర్పు వీధిపోటు లేదా తూర్పు వీధి చూపు అంటాం.




తూర్పు భాగం నుంచి తగిలే వీధులన్నీ కూడా ఎక్కువ శాతం చెడు ఫలితాలనే ఇస్తాయి.

ఒకవేళ ఒక ఇండిపెండెంట్ హౌస్ ఉండి, ఆ ఇంటికి చుట్టూ కాంపౌండ్ వాల్ ఉన్నప్పుడు తగిలే ఈ వీధి పోటు కాంపౌండ్ వాల్ తూర్పు భాగంలో తగులుతుంది. కాంపౌండ్ వాల్ లేకుండా స్ట్రెయిట్‌గా ఇల్లే నిర్మాణమై ఉంటే, ఈ వీధి నేరుగా ఇంటి తూర్పు భాగానికి తగులుతుంది.

అయితే ఈ వీధి పోటు సాంద్రత అనేది దాని స్వరూప, స్వభావాలను బట్టి ఉంటుంది. క్షేత్రానికి లేదా గృహానికి వీధి పోటుగా తగులుతున్నటువంటి వీధి ఎటువైపు పల్లంగా ఉంది? ఎటువైపు మిర్రుగా ఉంది? వీధి వెడల్పు ఎంత? ఇంటికి తగిలి ఎటువైపు మరలి వెళ్తుంది? లేదా ఇంటి దగ్గరికి వచ్చి ఆగిపోతుందా? ఇలాంటి అనేక విషయాలను బట్టి వీధి పోటు సాంద్రతను నిర్ధారించవచ్చు.

ఆ ఇంటికి లేదా క్షేత్రానికి తూర్పు వైపున కూడా ఉన్నట్లయితే, ఆ వీధి ఉత్తరానికి పల్లంగా ఉందా? లేదా దక్షిణానికి పల్లంగా ఉన్నదా? అనే విషయం మీద కూడా వీధి పోటు ఆధారపడి ఉంటుంది.

**(మిగతా వచ్చే వారం..)**

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు : .........................................
పుట్టిన తేది : .........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .............
చిరునామా:.............................................

యాత్రా కథనం

రంగరాజు శ్యాంసుందర్ రావు

# అద్భుత యాత్రానుభవం

**ఆరు వందల సంవత్సరాలు పాలించిన అహోముల పేరు నుండి వచ్చిన అస్సాం రాష్ట్రాన్ని దర్శించుకునేందుకు గౌహతికి వెళ్లాం. ఈశాన్య రాష్ట్రాలకు సింహ ద్వారంగా ఉన్న రాష్ట్రం కనుక ఈ రాష్ట్రానికి గేట్ వే ఆఫ్ ఈశాన్య రాష్ట్రాలు అని పేరు వచ్చింది.**

అస్సాం ప్రాంతం చాలా భాగం ఎగుడు, దిగుడు, కొండలు, గుట్టలు లోయలుగా ఉంటుంది. గౌహతి విమానాశ్రయం నుండి దాదాపు ఇరవై కిలోమీటర్లు ప్రయాణించి ముందుగా నీలాంచల పర్వత శ్రేణిలో ఉన్న కామాఖ్య ఆలయానికి చేరుకున్నాం. ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇది 51 శక్తి పీఠాల్లో ఒకటి. ఇక్కడే దశ మహావిద్యలనే పేరు గల కాళీ, తార, భువనేశ్వరి, బగలాముఖి, చిన్న మస్త, భైరవి, ధూమావతి, కమలాంబిక, షోడసి, మాతంగి అనే పది వేరు వేరు ఆలయాలు ఉన్నాయి. కాముణ్ణి దహించిన ప్రదేశంగా దీనికి కామాఖ్య అనే పేరు స్థిరపడింది.

ఎనిమిదవ శతాబ్దంలో నిర్మించబడినట్లుగా భావిస్తున్న ఈ ఆలయం 16వ శతాబ్దంలో అన్య మతస్తుల దాడుల్లో ధ్వంసం కాగా 17వ శతాబ్దంలో కుచ్ బీహార్ రాజు నర నారాయణుడు పునర్నిర్మించాడని శాసనాధారాలు ఉన్నాయి. ఈ ఆలయం మూడు మండపాలుగా నిర్మించి ఉంటుంది. మొదటి ప్రాకారంలో గుహలా ఉండి గర్భాలయంలో నల్లటి బండరాయి ఉంటుంది. దీనికి పూజలు జరుగుతాయి. ఆ గుహలో రాతి మీద ఎప్పుడు జలం ఊరుతూ తడిగా ఉండి జారుతూ ఉంటుంది.

ప్రతి సంవత్సరం జూన్ రెండవ వారంలో 'అంబుభాషి' సమయంలో నాలుగు రోజులు ఈ ప్రాంతంలోని ఆలయాలన్నీ పూర్తిగా మూసివేస్తారు. ఈ ప్రాంతంలో ఇంకా అనేక ఆలయాలు ఉన్నాయి. సమయాభావం వల్ల ముఖ్య ఆలయాలను మాత్రమే దర్శించుకొని ఆ రోజు సాయంత్రం బ్రహ్మపుత్ర నదిలోని క్రూయిజ్ విహార యాత్ర కోసం బయలుదేరాం.

## బ్రహ్మపుత్ర నది

ఇక బ్రహ్మపుత్రా నది విశేషాల్లోకి వస్తే బ్రహ్మపుత్ర ఆసియాలోని ముఖ్యమైన నదుల్లో ఒకటి. చాలా నదులు సహజంగా స్త్రీ పేరుతో పిలవబడగా బ్రహ్మపుత్ర మాత్రమే పురుష నామంతో పిలవబడటం విశేషం. ఈ నది టిబెట్‌లో నైరుతి ప్రదేశంలో యార్లు నదిగా పుట్టి దక్షిణ టిబెట్‌లో దిహన్ నదిగా ప్రవహించి హిమాలయాలలోని లోతైన లోయలోకి ప్రవహించి దాదాపు మూడు వేల కి.మీ. ప్రవహించి చివరగా బంగాళాఖాతంలో కలుస్తుంది. దీని పరివాహక ప్రాంతం దాదాపు 650 చదరపు కిలోమీటర్లు. ఈ నది ప్రత్యేకత ఏమిటంటే సముద్రం లాగానే ఈ నదిలో కూడా అలలు ఉవ్వెత్తున ఎగిసి పడతాయి. ఇది భారతదేశం, బంగ్లాదేశ్, భూటాన్, చైనా దేశాల్లో ప్రవహిస్తుంది.



మేం మొట్టమొదటిసారి మానస సరోవరం వెళ్లినప్పుడు ఉత్తర హిమాలయాల్లోని కైలాస పర్వతం దర్శించినప్పుడు అతి తక్కువ ప్రవాహంతో కనిపించిన ఈ నది అస్సాంలో ఉగ్ర రూపంతో దర్శనమిచ్చింది. ఈ నది ప్రవాహ వేగం దాదాపు పది వేల అడుగుల ఎత్తులో ప్రవహించి ప్రపంచంలోని అన్ని నదుల కన్నా ఎత్తుగా ప్రవహిస్తున్న నదిగా కూడా రికార్డుల్లో ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈ నది వెడల్పు దాదాపు 12 కి.మీ. నుండి 24 కి.మీ. పైబడి కూడా ఉండి కొన్ని ప్రాంతాల్లో దాదాపు డెబ్బై అడుగుల లోతు ఉంటుంది. ఇది ప్రపంచంలోనే 9వ అతి పెద్ద నది.

మా క్రూయిజ్ ప్రయాణం లోహిత్ గాట్‌లో ప్రారంభం అయింది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో సూర్యాస్తమయం చూడడానికి చాలామంది క్రూయిజ్ ప్రయాణం ఎంచుకుంటారు. సుమారు రెండు గంటలు క్రూయిజ్‌లో నది విహారం చేసాం. చుట్టుపక్కల ఉండే నదిలోని దీవులు, ఎత్తయిన భవనాలు, వాటి అలంకరణలు, వాటి ప్రతిబింబాలు నీటిలో ఎంతో అద్భుతంగా కనిపిస్తాయి.







ఆ మరుసటి రోజు ఉదయం ఉపాహారం ముగించుకొని తదుపరి యాత్రా ప్రదేశం అయిన కజిరంగా నేషనల్ పార్క్ చూడ్డానికి బయలుదేరాం. గౌహతి నుండి దాదాపుగా 204 కి.మీ. దూరంలో ఉన్న కజిరంగా చేరడానికి దాదాపు ఐదు గంటలు పడుతుంది. మధ్యలో దారిలోని కొన్ని ప్రదేశాలను దర్శించుకుని నాలుగు గంటల వరకు కజిరంగాలోని వసతి గృహం చేరుకున్నాం.

మా వసతి గృహంలో విహరించినప్పుడు ఆకాశం మొత్తం తెల్లని చుక్కలు అదినదన నల్లని చీర కట్టుకుందా అనిపించింది. కాంతి కాలుష్యంతో నక్షత్రాలే కనబడని నగరంలో రాత్రి అందాలు ఎంత మిస్ అవుతున్నామో తెలిసింది.

ఆ మరుసటి ఉదయం 8 గంటలకు కజిరంగా పార్కుకు చేరుకున్నాం. హెరిటేజ్ పార్క్‌గా గుర్తింపు పొందిన కజిరంగా పార్కు 1905లో స్థాపించబడి 1974లో నేషనల్ పార్కుగా అవతరించింది. సుమారు డెబ్బై వేల ఎకరాలు కలిగి వున్న ఈ పార్కు మధ్య నుండి బ్రహ్మపుత్రా నది కూడా ప్రవహిస్తుంది. ఈ పార్కు ప్రపంచంలోనే మూడింట రెండు వంతులు ఒక కొమ్ముగల ఖడ్గమృగాలు ఇందులో ఉన్నట్లు అంచనా. ఒక్కొక్క ఖడ్గ మృగం 1600 కేజీల నుండి 2700 కేజీల వరకు ఉంటాయి. ఇవి అపాయం ఉన్నట్టు గమనిస్తే గంటకు యాభై కి.మీ. వేగంతో పరిగెత్తుతాయి.

ఈ పార్కులో 57 శాతం నీటి గేదెలు, ఏడు జాతుల రాబందులు, ఏనుగులు, జింకలు, మెరిసే జింకలు, క్యాపడ్ లంగూర్లు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, బెంగాల్ ఫాక్స్, హిమాలయన్స్ స్క్వెరిల్‌తో పాటు దాదాపు నాలుగు వందల పక్షుల జాతులు, పదిహేను రకాల క్షీరదాలు ఉన్నట్లు అంచనా.

ఇందులో ఏనుగులపై స్వారీ, ఐదు జోన్లలో జీప్ సఫారీలు ఉంటాయి. జీప్ సఫారి ఉదయం ఎనిమిది గంటలకు



మొదలవుతుంది. జీప్ సఫారీలో ప్రయాణించి ఖడ్గమృగాలను, ఏనుగుల గుంపును, జింకల గుంపును, నీటి గేదెలను మాత్రమే చూడగలిగాం. ఒకే మారు నాలుగు నుండి ఐదు జీపులను ఒక ఫారెస్ట్ గార్డ్ అనుమతిస్తారు.

చాలా రకాలైన అరుదైన పుష్పాలు, అరుదైన మొక్కలు చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాం.

మరునాడు కజిరంగా నుండి సాంస్కృతిక కళలకు నేపథ్యమున్న తేజ్‌పూర్ బయలుదేరాం. దారిలో కొసాయి అనే గ్రామంలో అతి ఎత్తైన మహా మృత్యుంజయ లింగం దర్శించుకుని ఈ ప్రాంతంలో రాక్షస గురువైన శుక్రాచార్యుడు మృత్యుంజయ మంత్రంతో తపస్సు చేశాడని ఈ తదుపరి స్థానికులు ఈ ప్రాంతంలో అతి ఎత్తయిన శివలింగాన్ని ప్రతిష్టించి ఇప్పటికీ పూజలు కొనసాగిస్తున్నారని స్థానికులు చెప్పారు.

తేజ్‌పూర్‌లో బాణాసుర రాజుచే నిర్మించబడ్డ పురాతన ప్రముఖ మహా భైరవ ఆలయం దర్శించుకున్నాం. ఇక్కడి శివలింగం ప్రతి సంవత్సరం క్రమంగా పెరుగుతున్నట్టు స్థానికులు చెప్పారు. అక్కడి నుండి బ్రహ్మపుత్రా నదీ తీరంలో బాణాసుర రాజు తన కుమార్తె ఉష, అనిరుధ్‌ని ప్రేమించిన విషయం తెలుసుకొని వారిని కలవనీయకుండా ఆమెను బంధించి ఉంచిన ప్రదేశం అగ్నిగర్ దర్శించుకున్నాం. ఈ అగ్నిగర్ గుట్ట పైభాగంలో ఉంటుంది. ఈ ప్రాంతం నుండి బ్రహ్మపుత్రా నది ప్రవాహాన్ని సూర్యోదయ అందాలను బ్రహ్మపుత్రా నది పైన నిర్మించిన అతి పెద్ద బ్రిడ్జి నిర్మాణాన్ని, తేజ్‌పూర్ పట్టణాన్ని చూసాం. ఇక్కడి నుండి బ్రహ్మపుత్ర ఘాట్లు, అక్కడి తేయాకు తోటలను దర్శించుకుని వసతి గృహం చేరుకున్నాం.

అద్భుత అస్సాం అందాలను దర్శించిన ఆనందం గుండెల నిండుగా నింపుకొని ఇంటికి చేరుకున్నాం.

# ముసురుకుంటున్న వ్యాధులు

డా॥ బుగ్గ మధుసూదన్ రెడ్డి

దేశవ్యాప్తంగా ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా అసాధారణ ఉష్ణోగ్రతలు, అసంబంధ వర్షపాత మార్పుల మూలంగా నీటి ఒత్తిడితో పాటు మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, టైఫాయిడ్, కలరా లాంటి సంక్రమిత వ్యాధులు జనావాసాలను ముసురుకుంటున్నాయి.

ప్రతి ఇంట్లో జ్వరాలు, ఒళ్ల నొప్పులు, నీరసం లాంటి వ్యాధి లక్షణాలు సర్వసాధారణం అవుతున్నాయి.

ఇలాంటి సీజనల్ అనారోగ్యాలను నిరక్ష్యం చేస్తే ప్రాణాంతక స్థితి కూడా రావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సంక్రమిత ప్రాణాంతక సీజనల్ వ్యాధుల్లో ముఖ్యమైన కొన్నింటిని గురించి అవగాహన కలిగి ఉందాం.

## డెంగ్యూ

డెంగ్యూ పేరు వింటేనే ప్రజలు వణికిపోతున్నారు. ఏయిడిస్ దోమ కాటుతో సంక్రమించే ప్రమాదకర సీజనల్ వైరల్ వ్యాధిగా డెంగ్యూకు పేరుంది. అధిక జ్వరం, రక్తస్రావం, తీవ్ర తలనొప్పి, కండరాల కీళ్ల నొప్పి, దద్దుర్లు, శ్వాస ఇబ్బంది, ఊపిరి ఆడకపోవడం, మూత్రం తగ్గుదల లాంటి వ్యాధి లక్షణాలతో డెంగ్యూ రోగం జనులకు వణికిస్తున్నది.

డెంగ్యూ వ్యాధిగ్రస్థుల్లో రక్తంలో ప్లేట్లెట్స్ కౌంట్ పడిపోతుంది. త్వరగా వ్యాధిని నిర్ధారించడం, హైడ్రేషన్ పెంచుతూ వైద్యుల సలహాలతో చికిత్స తీసుకోవడం తప్పక జరగాలి.



## టైఫాయిడ్

“సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియమ్“తో కలుషితమైన ఆహారం తీసుకోవడం, నీరు తాగడం వల్ల టైఫాయిడ్ రోగం సంక్రమిస్తుంది. టైఫాయిడ్ రోగుల్లో దీర్ఘకాలం పాటు జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి, నీరసం లాంటి రోగ లక్షణాలు బయట పడతాయి. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతుల్ని శుభ్రంగా కడుక్కోవడం, మరిగించిన నీటిని మాత్రమే తాగడం, పరిశుభ్రంగా వంటలను చేయడం లాంటి జాగ్రత్తలు తీసుకున్నపుడు టైఫాయిడ్ వ్యాధికారక బ్యాక్టీరియా నుంచి రక్షణ కలుగుతుంది. టైఫాయిడ్ వ్యాధి నిరోధక టీకాలను వేసుకోవడం కూడా ఉత్తమ మార్గమని మరువరాదు.

## మలేరియా


ఉష్ణమండల దేశాల్లో మలేరియా రోగం తీవ్రంగా కనిపిస్తుంది. ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల సంక్రమించే ప్రోటోజోవాకు చెందిన ఏకకణ జీవి “ప్లాస్మోడియం” పరాన్న జీవితో మలేరియా వ్యాధిగ్రస్థులు అధిక జ్వరం, తీవ్ర చలి, తలనొప్పి, ఒళ్ల నొప్పులు, నీరసం లాంటి రోగ లక్షణాలు కనుపిస్తాయి. రోగ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందని యెడల ఖిసెరెబ్రల్ మలేరియాఖిగా మారి వణుకు, రీనల్ ఫెయిల్యూర్, జాండీస్, శ్వాసకోశ ఇబ్బందులు లాంటి ప్రమాదకర లక్షణాలతో ప్రాణాంతక స్థితి కూడా రావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## చికున్ గున్యా

“అడెస్ ఎజిప్టీ“ రకం దోమకాటుతో సంక్రమించే “లేప్టోస్పైరా వైరల్“ వ్యాధిగా చికున్ గున్యాకు పేరుంది. అధిక జ్వరం, తీవ్ర కీళ్ల కండరాల నొప్పులు, తల నొప్పి, అలసట, దద్దుర్లు, కీళ్ల వాపులు లాంటి వ్యాధి లక్షణాలు 7 రోజుల తర్వాత కనిపిస్తాయి. విశ్రాంతి తీసుకోవడం, నొప్పికి చికిత్స పొందడం, మందులు తీసుకోవడం, శరీరంలో నీటి శాతాన్ని ద్రవాలను తీసుకుంటూ హైడ్రేషన్ ద్వారా నియంత్రించడం వెంటనే జరగాలి.

## నీఫా జ్వరం

“నీఫా వైరస్“ సంక్రమణంతో వచ్చే నీఫా వ్యాధి రోగుల్లో జ్వరం, తలనొప్పి, మైయాల్జియా, వాంతులు, నీళ్ల విరోచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్ జ్వర తీవ్రత పెరిగి మెదడుకు చేటు చేస్తూ ప్రాణాంతకంగా మారుతుంది. వ్యాధిగ్రస్థులను ఒంటరిగా ఉంచడం, క్వారంటైన్ చేయడం, వ్యాధి చికిత్స పొందడం వెంటనే జరగాలి.



చికెన్ గున్యా

## నెప్టోస్పైరోసిస్

నీరు, నేల కలుషితం కావడంతో పాటు వరదల సమయాల్లో “నెప్టోస్పైరోసిస్“ రోగం అంటుకుంటుంది. బ్యాక్టీరియా సంక్రమిత వ్యాధిగా నెప్టోస్పైరోసిస్ రోగుల్లో అధిక జ్వరం, చలి, తీవ్ర తలనొప్పి, వాంతులు లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి. రక్షణ వస్త్రాలను ధరించడం, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం ఉత్తమ మార్గమని గమనించాలి.

# వాహ్ ఉస్తాద్.. జాకీర్ హుసేన్

కోట దామోదర్

**ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ (73) మరణవార్త ప్రపంచ సంగీత ప్రియులందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. భారతీయ శాస్త్రీయ సంగీత వాయిద్యాలలో అత్యంత ప్రజాదరణ పొందిన తబలా పై కమనీయ ధ్వనులు పలికించి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించిన గొప్ప కళాకారుడు.**

తబలాపై తన మధురమైన ధ్వనులు శ్రోతల మదిని మృదు మధుర రాగాలతో మురిపిస్తాయి.

తబలా పై అతని చేతి మునివేళ్ళు అలల్లా ఓలలాడుతూ మధుర మృదంగాలై మోగుతుంటాయి.

తెలుగు రాష్ట్రాల్లో చాలా మందికి జాకీర్ హుస్సేన్ పేరు చెప్పగానే తబలా విద్వాంసుడు గుర్తుకు రాకపోవచ్చు కానీ తాజ్ మహల్ టీ యాడ్‌లో తబలా వాయించిన వ్యక్తి అంటే అందరికీ తెలుసు.

## ఎలా మరిచిపోగలం...

చాలామంది సెలబ్రిటీలు, ప్రముఖులు తన పేరుతో అందరికి పరిచయమవుతుంటారు. కానీ కొంతమంది మాత్రం తన పేరుతో కాకుండా తన ప్రతిభతో పరిచయమయ్యేవారు అతి కొద్దిమంది ఉంటారు అందులో జాకీర్ హుస్సేన్ ఒకరు. మొదటగా మన దేశంలో బ్రూక్ బాండ్ తాజ్ మహల్ టీని 1966లో కోల్‌కతాలో నటీనటులు జీనత్ అమన్ మాళవిక తివారీ తాజ్ మహల్ టీ యాడ్‌తో ప్రారంభించారు కానీ తయారీదారులు ఆశించినంత ప్రజాధారణ పొందలేకపోయిందని గమనించారు. ఆ తర్వాత హిందుస్థాన్ థాంప్సన్ అసోసియేట్స్ ఒక కొత్త బ్రాండ్ ఇమేజ్‌ని రూపొందించడానికి భారతీయతను పాశ్చాత్య ఎక్స్‌పోజర్‌తో సమతుల్యం చేసే బ్రాండ్ అంబాసిడర్ అవసరం వచ్చింది. తబలా అభిమాని అయినా కాపీ రైటర్ జాకీర్ హుస్సేన్ పేరు ఎంపిక చేశారు. ఎంపిక సమయానికి హుస్సేన్ శాన్ ఫ్రాన్సిస్కోలో ఉండటంతో చక్రవర్తి అతన్ని సంప్రదించి తాజ్ మహల్ టీ యాడ్ మీరే చేయాలనీ పట్టుపట్టడంతో అందుకు హుస్సేన్ విముఖత చూపలేక సరే అని తాజ్ మహల్ టీ దేశ



నలుమూలల వ్యాప్తి చెందాలనే సంకల్పంతో యాడ్ కోసం తన సొంత ఖర్చుతో శాన్ ఫ్రాన్సిస్కో నుంచి ఢిల్లీ కి వచ్చారు. ప్రకటన స్క్రిప్ట్ కొరకు గంటల తరబడి సాధన అనంతరం విజయవంతంగా పూర్తి చేశారు. దీన్నిబట్టి దేశంపై జాకిర్ హుసేన్ ప్రేమ ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. టీవీ వాణిజ్య ప్రకటన తర్వాత తాజ్ మహల్ టీ బ్రాండ్ హుస్సేన్ ఇంటి పేరుగా మారింది. అయితే ఈ ప్రకటనలో హుస్సేన్ కప్పు టీ తాగుతూ కనిపిస్తున్న దృశ్యాన్ని మరియు తబలా నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ ప్రసిద్ధ స్వరకర్త హరీష్"వాహ్ ఉస్తాద్, వాహ్!" చెబుతుండటం దానికి బదులుగా పెర్కషన్ వాద్యకారుడు, "అరే హుజూర్, వాహ్ తాజ్ బోలియే" ప్రకటన బాగా ప్రాచుర్యం పొందింది. తాజ్ మహల్ టీ దేశవ్యాప్తంగా వ్యాపించింది. అంతేకాకుండా "వాహ్ తాజ్" అనే పదం చాలా సందర్భాలలో తరచుగా ఉపయోగించే బజ్‌వర్డ్‌గా మారింది. ప్రతి రోజు ఉదయాన్నే తాజ్ మహల్ టీ తాగే ప్రేమికులు మాత్రం ఆయనను ఎలా మరిచిపోగలరు. సంగీత ప్రియుడైన నేను తన మధురమైన ధ్వనులను ఎలా మరిచిపోగలను చెప్పండి. ఆయన ప్రతిభకు ఎవరైనా"వాహ్ ఉస్తాద్, వాహ్ అనాల్సిందే.

నాలుగు గ్రామీ అవార్డులతో పాటు, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, నేషనల్ హెరిటేజ్ ఫెలోషిప్, ఫ్రాన్స్ ఆర్డర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్‌లో అధికారితో సహా లెక్కలేనన్ని అవార్డులు మరియు గౌరవాలు అందుకున్నారు. 2024లో జరిగిన 66వ గ్రామీ అవార్డుల్లో ఒకే రాత్రి మూడు ట్రోఫీలు గెలిచిన తొలి భారతీయుడిగా జాకీర్ చరిత్ర సృష్టించారు.

ఆరు దశాబ్దాల పాటు సాగిన సంగీత ప్రయాణంలో, మన దేశంతోపాటు ఎంతోమంది అంతర్జాతీయ కళాకారులతో కలిసి పనిచేసిన అనుభవం ఆయనది.

## ఒదిగి ఉండే తత్వం

మన నిత్యజీవితంలో ఒక చిన్న అవార్డు వస్తే ఉప్పొంగి పోయే వాళ్ళని చూస్తుంటాము. కానీ కొంతమంది ఎన్ని అవార్డులు సంపాదించినా నేనే గొప్ప అనే భావన ప్రస్తావించరు అలాంటి వారిలో జాకిర్ హుస్సేన్ ఒకరు. "ఎన్ని అవార్డులు వచ్చినా, ఎప్పుడూ నేర్చుకోగలగడం ఎంతో ముఖ్యం అని చెపుతుంటారు. చిన్నప్పుడు తండ్రి చెప్పిన ఒకే ఒక మాట "మనల్ని మనం బెస్ట్ అని అనుకోకూడదని" తండ్రి చెప్పిన మాటే ఇప్పటివరకు ఈస్థాయిని చేర్చగలిగిందని పలు ఇంటర్వ్యూ లో స్వయంగా చెప్పారు. అసలు సిసలు హిందుస్తానీ రాగాల ఉస్తాద్ హుస్సేన్ ఇక లేడన్న విషయం సంగీత ప్రియులందరికీ దిగ్భ్రాంతికి గురిచేసింది. కానీ తన మధురమైన ధ్వనులు శ్రోతల మదిని మృదు మధుర రాగాలతో మురిపిస్తూనే ఉంటాయి. ■

# వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు.
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం

సంఘసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. కుటుంబ పరమైనటువంటి సర్దుబాట్లు అధికంగా ఉంటాయి. ఇంట్లో కొంతమంది ప్రవర్తన బాగాలేక ప్రశాంతత కొరవడుతుంది. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. వైద్యుడిని కలిసి రక్త పరీక్షలు చేయించుకుంటారు.

## వృషభం

రుణ బాధలు అధికంగా ఉంటాయి. రుణాలు తీర్చడం కోసం చేసే ప్రతి ప్రయత్నం అంతంత మాత్రంగానే ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆదాయానికి సరిపడా ఖర్చులు ఉంటాయి. సర్వ రక్షా చూర్ణం, సర్వదోష నివారణ చూర్ణం కలిపి స్నానమాచరించండి. వ్యాపారం నిలకడగా సాగుతుంది. లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి.

## మిథునం

నూతన వ్యాపారానికి తగిన పెట్టుబడులను అందు కుంటారు. ఇరుగు-పొరుగు వారితో మాట పట్టింపులు, చిన్న చిన్న గొడవలు ఏర్పడతాయి. ఫుడ్ వ్యాపారస్తులకి క్యాటరింగ్ వ్యాపారస్తు లకి అనుకూలంగా ఉంటుంది. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, త్రిశూల్ పొడితో ధూపం వేయడం మంచిది. నరదృష్టి తొలగిపోతుంది. కొత్త కార్యక్రమాల పట్ల ఆకర్షితులవుతారు.

## కర్కాటక

తొందరపాటు నిర్ణయాలకు తావివ్వకుండా ఎంతగానో ప్రయత్నిస్తారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. చుట్టుపక్కల విషయాలలో అతిగా కలగజేసుకోకుండా మీ గౌరవం దక్కించుకుంటారు. మెడలో కాలభైరవ రూపు ధరించండి. దూర ప్రయాణాలను తాత్కాలికంగా వాయిదా వేస్తారు. దైవ చింతన కలిగి వుంటారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటారు.

## సింహం

అందరూ ఆశ్చర్యపడే విధంగా మీలో మార్పులు వస్తాయి. ప్రేమపెళ్లి చేసుకోవాలన్న ఆలోచన కలిగి వుంటారు. ప్రకృతి వైద్యం, ఆయుర్వేద వైద్యం తీసుకుంటారు. సంఘ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. తోటలు ఆకర్షిస్తాయి. కొన్ని సందర్భా లలో మామిడి, కొబ్బరితోటలు వేయాలని ఆలోచిస్తారు. కొన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆహార నియమాలు పాటిస్తారు.

## కన్య

ఇంట్లో కొన్ని కూరగాయలను పండించుకోవాలన్న ఆలోచనలు వస్తాయి. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. జీవితాశయాన్ని సాధించడం ప్రస్తుతానికి అసాధ్యంగా మారుతుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అయినవాళ్లతో ఏకీభవించలేని పరిస్థితులు ఏర్పడతాయి. అయినప్పటికీ మీలో చలనం ఉండదు. జీవిత భాగస్వామితో మాటపట్టింపులు వస్తాయి.

## తుల

కోర్టు వ్యవహారాలు, తీర్పులు వాయిదాల రూపంలో ఉంటాయి. కొంతమంది పట్ల కోపంతో ఉంటారు. నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. స్నేహితుల సహకారం లభిస్తుంది. సొంత కాళ్ల మీద నిలబడే ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. వ్యాపారంలో కొత్త విభాగాలను ప్రవేశపెడతారు. ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

## వృశ్చికం

కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది. విదేశాల్లో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది. స్త్రీ సంతానం పట్ల మక్కువ కలిగి వుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంఘసేవా కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి వుంటారు. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుట ఆ బొట్టు ధరించండి.

## ధనుస్సు

కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రయోజనాలని అందుకుంటారు. విలువైన సమాచారం తెలుసుకుంటారు. ప్రత్యర్థి వర్గం మీద గెలుపు కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధించగలుగుతారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కోపతాపాలను విడిచిపెట్టి కొత్త విషయాలను గ్రహించే ప్రయత్నాలు చేస్తారు. కొంతమంది వ్యక్తుల పట్ల మీకున్న అభిప్రాయం మారుతుంది.

## మకరం

కొత్త కార్యకర్తలను చేర్చుకుంటారు. నూతన కార్యక్రమాలను స్నేహితులతో ప్రారంభిస్తారు. సహ ఉద్యోగులు, సహచర బృందం అనుకూలంగా ఉంటారు, మీరు చెప్పిన పనులు చేసి పెడతారు. ప్రయోజనాలను మాత్రం ఆశించరు. అరటినార వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. వీసా, స్టాంపింగ్ వ్యవహారాలు అనుకూలం.


## కుంభం

కొత్త కార్యక్రమాల నిమిత్తం దూరపు ప్రయాణాలు అనుకూలిస్తాయి. కొత్త ప్రదేశాలకు వెళ్లాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. మానసిక ఉత్సాహం, ధైర్యం కలిగి వుంటారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. కొన్ని పనులను పూర్తి చేయాలన్న ఆలోచనలు కలిగి వుంటారు. స్నేహితులకు సహాయ, సహకారాలు అందిస్తారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాలు అనుకూలంగా మారుతాయి.


## మీనం

పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. నూతన ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. జీవిత భాగస్వామితో కలిసి వుండాలన్న ఆలోచనలు ఏర్పడతాయి. తల్లితరపు బంధువులతో చిన్న గొడవలు సంభవిస్తాయి. చేతికి కుబేర కంకణం ధరించండి. లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. మీరు చేసిన సహాయ సహకారాలు, త్యాగాలు కొంత మందికి కనిపించవు. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్త.


# ఈ వారం కా'ర్టూన్స్'



'షెఖావత్' కాదు
కానిస్టేబులే..!!

అమ్మాయి పెళ్ళి కుదిరిందట
ఫేస్ బుక్కా .. మేనరికమా?!

మన డాడీ నయాపైసా సంపాదించకుండా మంచి పని చేశాడు కదా...!!
లేకుంటే ఆస్తుల కోసం తన్నుకుని జైల్లో ఉండేవాళ్ళం....!!!



యునెస్కో వారసత్వ గుర్తింపు
పొందిన ఈ కొండ శ్రీలంకలో ఉంది.
దీనిని సిగిరియా కొండ అని పిలుస్తారు.
దట్టమైన అడవి మధ్యలో ఉన్న కొండపై ఓ
కోట వుండం విశేషం.



